జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 5 పక్షపత్రిక మార్చి 1-15, 2017


## మహిళా రిజర్వేషన్‌ను రాజకీయ పార్టీలకు వర్తింప చేయడం మేలు : జేపీ



## 'సృజనాత్మక ఒత్తిడి' పోరాట పంథాకు 100 ఏళ్లు









సామాజిక ఆర్థిక అభివృద్ధి - లింగ సమానత్వం,
ప్రజా సమాచార వ్యవస్థగా ఆకాశవాణి, వ్యక్తిత్వ
వికాసం తదితర అంశాలపై వివిధ వేదికల మీద
ఆలిండియా రేడియో హైదరాబాద్ కేంద్రం
నిర్వహించిన కార్యక్రమాల్లో లోక్‌సత్తా
వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 5

## లోపలి పేజీల్లో...

మహిళా రిజర్వేషన్‌ని రాజకీయ........... 5

ప్రాతినిధ్యం +పరిష్కార శక్తి =..............8

రాజకీయాలను పవిత్ర వ్యాసంగంగా......11

మహిళల ప్రాతినిధ్యానికి ప్రత్యామ్నాయ.. 13

సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథాకు..... 17

భారత ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు..... 23

భావజాల అన్వేషణలో 'ఆప్'................ 25

విద్య విషయంలో మోసాన్ని గుర్తించాలి.. 27

అవార్డు ఎవరికిచ్చినా... ఆ క్రెడిట్........... 28

ఎఫ్‌డీఆర్ రూపొందించిన విద్య .......... 29

ఉత్తరాంధ్ర పట్ల వివక్షకు వ్యతిరేకంగా..... 30

ఏపీలో ఆర్భాటాలు, ప్రగల్భాల పాలన...... 32

తమిళుల నుంచి కళాభిమానం ........... 33

మోదీ వ్యక్తిగత నిజాయతీ చాలదు........ 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# 'యూత్, డేటా' సాధించాల్సిన పరిష్కారాల విప్లవం



"ఆలోచన, అంకితభావం గల కొద్దిమంది బృందం ప్రపంచాన్ని మార్చగలదా? అని ఎప్పుడూ సందేహించొద్దు. నిజానికి మార్పులు వచ్చిందే అలా" అని అమెరికన్ మానవ శాస్త్రవేత్త మార్గరెట్ మీడ్ చెప్పిన మాటలు భారత రాజకీయాలకు మాత్రం వర్తించవు అని నిరుత్సాహపరిచినా, చైనాలోనైనా మార్పుని తేవచ్చుగానీ సువిశాలత, సంక్లిష్ట భిన్నత్వం వల్ల భారత్‌లో తేవటం మాత్రం చాలా కష్టం అని సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూలాంటి వాళ్లూ వ్యాఖ్యానించినా, పచ్చికాయను మాగబెడుతున్నామా అని శ్రేయోభిలాషుల్లోనే సందేహాలున్నా.. ఈ దేశంలో అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే వ్యవస్థీకృత మార్పు కోసం లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని నిర్మించే సాహసం చేయటానికి 'జనాభాలో అత్యధికశాతమున్న యువత, అపార సాంకేతిక పరిజ్ఞానాలే' ప్రధాన కారణాలు. యువత, సాంకేతికత ఇప్పుడు పూర్తిస్థాయి సామర్థ్యదశలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ రెండు దశాబ్దాల్లో లోక్‌సత్తా వేసిన పునాది విస్తరించటానికి సమయం ఆసన్నమైందని సంకేతాలిస్తున్నాయి. సాంకేతికత, యువత పక్వ దశలోకి రావటం వల్ల ఈ దేశంలో వ్యక్తిగత, బృంద స్థాయి నుంచీ అపారంగా డేటా ఉత్పత్తి అవుతోంది. సమస్యల పరిష్కారానికి కేవలం సర్వేలు, ఇతరత్రా గణాంకాలకే పరిమితం కాకుండా, యువత నుంచి బహుముఖంగా వచ్చిపడుతున్న ఈ డేటాను కూడా ఉపయోగించుకునే అవకాశం ఏర్పడింది. అయితే ఇది కేవలం నాలుగో వాణిజ్య/పారిశ్రామిక విప్లవావకాశంగానే తప్ప వ్యవస్థీకృత మార్పు విప్లవావకాశంగా కూడా ఉపయోగపడకపోతే.. అసమానతలు ఇంకా తీవ్రమై మన ఆర్థిక, సామాజిక, ప్రజాస్వామిక నిర్మాణాలకు ముప్పుగా మారతాయి. ఎన్నో ఏళ్లుగా లోక్‌సత్తా చెబుతున్నట్టు.. మానవజాతి చరిత్రలో ఇప్పటివరకూ ఏ తరానికీ లేనన్ని అవకాశాలు ఈ తరంవారికి ఉన్నాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకునే రోడ్‌మ్యాప్ లేకుంటే అవి చేజారి సవాళ్లు పెరుగుతాయి. డేటాను సృష్టించటంతోపాటు పరస్పర సంధానతతో (విదేశీ అనుభవాల నుంచీ నేర్చుకుంటూ) దాన్ని స్వదేశం కోసం సద్వినియోగం చేయాల్సిన బాధ్యతను కూడా ప్రధానంగా మనలోని యువత తీసుకోవాలి. కానీ ఈవేళ అపారంగా వచ్చిపడుతున్న డేటాను మనం ఎంతమేర విశ్లేషించగలుగుతున్నాం? ఆ విశ్లేషణతో ఏ పరిష్కార నిర్ణయం తీసుకోగలుగుతున్నాం? ఈ పరిష్కారాల కోసం డేటాలోని చుక్కల్ని ఎలా కలపగలుగుతున్నాం? - ఇంకా సరైన జవాబులేని ప్రశ్నలివి. వ్యక్తిగతస్థాయి పరిష్కారాల్లో కొంత మెరుగ్గా ఉన్నాంగానీ, మన భద్రతను, స్వేచ్ఛని, ఎదిగే అవకాశాలను కనబడకుండా అణచివేస్తున్న వ్యవస్థీకృత సమస్యల్ని ఇంకా సరిచేయలేకపోతున్నాం. విదేశాలలో కూడా ప్రశంసనీయ నాయకత్వాన్ని అందించగలుగుతున్న మనం.. స్వదేశీ సమస్యల్ని పరిష్కరించే వ్యవస్థల్ని నిర్మించలేకపోతున్నాం. ఇటీవల తమిళనాడు పరిణామాలనే తీసుకోండి.. జయలలిత మరణం తర్వాత ఆమెకు అత్యంత విధేయుడు, మచ్చలేని పన్నీర్ సెల్వంను ముఖ్యమంత్రిని చేసిన శశికళ.. మళ్లీ రాజీనామా చేయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రోత్సాహాన్నో, మరొకరి అండనో చూసుకుని ఆయన తిరగబడ్డారు. కానీ పార్టీని, తగ్గట్టు ప్రభుత్వాన్ని పన్నీర్ సెల్వం నడపలేరు, శశికళ సొమ్ములు లేకపోతే అన్నాడీఎంకే పార్టీయే ఉండదు అని భావించి అత్యధిక ఎమ్మెల్యేలు ఆమెకపక్షం వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన కేసులో ఎంతోకాలంగా నిద్రపోతున్న తీర్పు సరిగ్గా శశికళ ముఖ్యమంత్రి అవటానికి ముందు వచ్చింది.. ఈ మొత్తం డేటా విశ్లేషణ ఏమిటి? పార్టీలు, అధికారం ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతమై ఉండటం వల్ల ఉత్పతన్నమైన సమస్యలు, అవినీతి డబ్బును అందించేవారు లేకుంటే పార్టీలు నడవకపోవటం, మెజారిటీ ఎమ్మెల్యేలు అవినీతి డబ్బుతో గెలిచి ఇంకా అవినీతికి పాల్పడుతుండటం, కేసులో శశికళ కంటే జయలలితే ఎక్కువగా దోషి కావటం, తీర్పుకి న్యాయవ్యవస్థ 21 ఏళ్లు తీసుకోవటం, సందేహాస్పద సమయంలో తీర్పును వెలువరించటం, తీర్పు ఇలాగే వస్తుందని ఊహించినట్టు గవర్నర్ వ్యవహరించటం, బలపరీక్ష రచ్చ.. వగైరాలు. కానీ వీటికి పరిష్కారం ఏమిటి? ప్రజల్లో ఎక్కువమంది భావించినట్టు.. కేవలం కాస్త మంచివాడు, మచ్చలేనివాడు కాబట్టి పన్నీర్ సెల్వంను ముఖ్యమంత్రిగా చేయటం మాత్రమే కాదు (లోక్‌సత్తా విద్యాసంస్కరణల్ని అభినందించిన పాండియ రాజన్ ఒక్కరే పన్నీర్‌వైపు వెళ్లిన మంత్రి). ఓటు వేసిన కొన్ని నెలల్లోనే మనం తూచ్ అనుకున్నా, కోట్లు ఖర్చు పెట్టి గెలిచిన ఎమ్మెల్యేలు అనుకోరు. కాబట్టి ముఖ్యమంత్రి ఆటగాడు ఎవరయినా, ఆటనియమాల్ని మార్చటమే ఇప్పుడు మనముందున్న సరైన పరిష్కారం. తమిళనాడులో సంక్షోభం బైటపడిందిగానీ, ఇది దేశవ్యాప్త సమస్య. పార్టీలు కొందరు వ్యక్తులు, వారి కుటుంబాల చేతిలో కూరుకుపోయి, అవినీతి డబ్బుతో ఎన్నికల్లో నెగ్గుతున్నాయి. దీన్ని పరిష్కరించటానికి ముఖ్యమంత్రికి ప్రత్యక్ష ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టి సమాజంలోని అత్యుత్తమ సమర్థులను కేబినెట్‌లో తీసుకోవటం, ఎమ్మెల్యేల్ని శాసనసభకు పరిమితం చేయటం, దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టటం, న్యాయ, పోలీస్ సంస్కరణలు వంటి మార్పుల్ని తెచ్చుకోవాలి. ఇలాంటి ఏర్పాట్లతో సమర్థులుండే బలమైన వ్యవస్థల్ని మనం నిర్మించుకోకపోవటం వల్లే.. మనదేశం 7శాతం వృద్ధిరేటును కొనసాగిస్తూ ఎంతో ఆర్భాటం చేస్తున్నా, సులభ వాణిజ్యం, ఆర్థిక స్వేచ్ఛ సూచీల్లో ఇంకా చివరి వరసల్లోనే ఉన్నాం. అవినీతి, నల్లధనం అంతమయ్యాయని మనమెంత ప్రచారం చేసుకున్నా సాక్ష్యాధారాలు కనిపిస్తుంటాయిగా! ఇదే సమయంలో 'ఇస్రో' ప్రపంచస్థాయి విజయం కనిపిస్తుంది. అంతరిక్ష పరిజ్ఞానంలో మేటి రష్యా ఒకేసారి 37 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టగలిగితే, భారత్ 104 ఉపగ్రహాలను ఎలా ప్రవేశపెట్టగలిగిందని ఆశ్చర్యం కలుగుతుంది. స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనం, నిరంతరం నూతన సామర్థ్యాలు వంటి ప్రమాణాలతో ఒక వ్యవస్థీకృత సంస్కృతి ఇస్రోలో ఉంది కాబట్టి ఈ అద్భుతం సాధ్యమైంది. పెద్ద నోట్ల రద్దు, తమిళనాడు, ఇస్రో.. ఇలా వచ్చే డేటాలన్నిటినీ సరైన ప్రాధాన్యతలతో విశ్లేషించుకుని, చుక్కల్ని సరిగ్గా కలుపుతూ విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానిక సాధికారత, చట్టబద్ధపాలన వంటి ఎజెండాతో సమగ్ర పరిష్కారం సాధించుకోవటం, స్థానిక నాయకత్వాన్ని అందించటం ఈవేళ యువ భారత్ ముందున్న ప్రధాన కర్తవ్యం. డేటా, యూత్.. ఈ మహావకాశాల్ని వ్యవస్థీకృత పరిష్కారాల విప్లవంగా మార్చుకుంటేనే ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశాలు, సుస్థిరాభివృద్ధి.

మీ

# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మహిళా రిజర్వేషన్‌ని రాజకీయ పార్టీలకు వర్తింపచేయటం మేలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

**రాజకీయాలలో మహిళల ప్రాధాన్యం పెరగటం వల్ల రాజకీయ సంస్కృతి కూడా త్వరగా మారుతుంది. హింసవిద్వేషాలు తగ్గి నాగరిక పద్ధతులు, మెరుగైన బహిరంగ చర్చాప్రమాణాలు సాధ్యమవు తాయి. బాధ్యతగా పనిచేయటం పెరుగుతుంది. మహిళా అభ్యర్థులు గెలవరు కాబట్టి వారికి ఎన్నికల్లో టికెట్లు ఇవ్వటం లేదని ప్రధాన సాంప్రదాయ పార్టీలు తరచూ చెబుతుంటాయి. ఇది పూర్తిగా మోసపూరిత వాదన. ప్రజలు మహిళలను నాయకులుగా ఎన్నుకోవటానికి ఎలాంటి సంకోచాన్నీ చూపటం లేదు. చెప్పాలంటే గెలిచిన అభ్యర్థుల్లో పురుషుల కంటే మహిళల శాతమే ఎక్కువ. జుగుప్సాకర, అగౌరవప్రదమైన రాజకీయ వాతావరణాన్ని కల్పించి ఆ ముసుగులో పార్టీలు ఉద్దేశపూర్వకంగా మహిళలకు అవకాశాలను నిరాకరిస్తున్నాయి.**



"ఇతరులు మన పట్ల ఏ పని చేస్తే ఇబ్బందిగా భావిస్తామో అటువంటి పనిని ఇతరుల పట్ల మనం చేయకుండా ఉండటమే గొప్ప ధర్మం" అని మహాభారత సూక్తిగా చెబుతుంటారు. నిజానికి ప్రజాస్వామ్యం అంటే ఇదే. అందరూ సమానమే, అందరికీ సమన్యాయం అన్నదే ప్రజాస్వామ్యం. కానీ ఇన్ని వేల సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ మహిళల గౌరవాన్ని, స్వేచ్ఛని కలిపిచూడటం మన సమాజానికి సాధ్యం కావటం లేదు. ఆశావహమైన ముందడుగుడులైతే పడుతున్నాయి. కుటుంబ జీవితంలో అలవడే సహజ నాయకత్వ లక్షణాలతోపాటు ఆధునిక అవసరాలకు తగ్గట్టు తన పాత్రను పునర్నిర్వచించుకునే ప్రయత్నంలో మహిళలు రాజకీయాలలో వేగంగా నాయకులుగా ఎదుగుతున్నారు. ప్రధానమంత్రి నుంచి పంచాయతీ వార్డు సభ్యురాలు వరకూ మహిళలు ప్రభావం చూపుతున్నారు. కానీ తగినంతగా కాదు. ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఎవరికైనా దక్కొచ్చుగానీ.. అన్ని వర్గాలకూ సముచిత ప్రాతినిధ్యం కనిపించకపోతే కచ్చితంగా ఏదో లోపం జరుగుతున్నట్టే లెక్క.

ఈవేళున్న పరిస్థితులు ఏమిటి, అందుకు మూలమైన గతమేమిటి, ఈరోజు మనం ఏరకమైన చర్యలు తీసుకుంటే మనం ఆశపడుతున్నట్టు రేపటిరోజును సాధించవచ్చు.. ఈ స్పష్టత సమాచారయుగంలో ఉన్న ఈతరానికి చాలా ఎక్కువగా కావాలి.

అమెరికా కంటే ఘనంగా మనదేశంలో మహిళలకు స్వతంత్రం వచ్చిన వెంటనే ఓటు హక్కును ఇచ్చినా, ప్రధానమంత్రి స్థాయిలో మహిళను ప్రజాదరణతో ఆమోదించినా, మహిళా సాధికారత దిశగా వాటంతటవే మౌలిక మార్పులు వచ్చే వాతావరణం ఇప్పటికిప్పుడైతే మనదేశంలో లేదు. డబ్బు, అధికారమే పరమావధిగా ఉన్న ప్రస్తుత రాజకీయ సంస్కృతి.. సమర్థత, నిబద్ధత ఉన్న మహిళల ప్రవేశానికి, వారు ఎదగటానికి అవరోధంగా ఉంది. ఈ రాజకీయాల్లో గెలిచిన మహిళలు కూడా పురుషుల్లాగే అవినీతి, అక్రమాలకు, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడుతున్నారనే ఆరోపణలూ వినవస్తున్నాయి. కాబట్టి మహిళలకు రాజకీయాలలో ప్రవేశించే అవకాశాల్ని గణనీయంగా పెంచే ఏర్పాటుతోపాటు వారు భర్త చాటునో, కుటుంబ సభ్యుల చాటునో పని చేయకుండా స్వతంత్రంగా పనిచేసి తమ వినూత్న నాయకత్వ శైలిని ప్రదర్శించే అవకాశాల్ని నిర్మించాలి.

ఇందిర, నందిని శతపథి, జయ లలిత, మాయావతి, మమతా బెనర్జీ వంటి వారు సొంత నాయకత్వ

లక్షణాలతో పెద్దపెద్ద నాయకుల మధ్య కూడా గొప్పగా రాణించారు. వారి పట్ల ఎన్ని అభ్యంతరాలున్నా వారి నాయకత్వ సామర్థ్యాన్ని అంగీకరించనివారు మాత్రం ఉండరు. అలాంటి నాయకత్వాన్ని ఎక్కువ శాతం మహిళలు ప్రదర్శించే అవకాశాలు ఉండాలి.

రాజకీయాలలో మహిళల ప్రాధాన్యం పెరగటం వల్ల రాజకీయ సంస్కృతి కూడా త్వరగా మారుతుంది. హింసవిద్వేషాలు తగ్గి నాగరిక పద్ధతులు, మెరుగైన బహిరంగ చర్చాప్రమాణాలు సాధ్యమవు తాయి. బాధ్యతగా పనిచేయటం పెరుగుతుంది.

మహిళా అభ్యర్థులు గెలవరు కాబట్టి వారికి ఎన్నికల్లో టికెట్లు ఇవ్వటం లేదని ప్రధాన సాంప్రదాయ పార్టీలు తరచూ చెబుతుంటాయి. ఇది పూర్తిగా మోసపూరిత వాదన. ప్రజలు మహిళలను నాయకులుగా ఎన్నుకోవటానికి ఎలాంటి సంకోచాన్నీ చూపటం లేదు. చెప్పాలంటే గెలిచిన అభ్యర్థుల్లో పురుషుల కంటే మహిళల శాతమే ఎక్కువ. జుగుప్సాకర, అగౌరవప్రదమైన రాజకీయ వాతావరణాన్ని కల్పించి ఆ ముసుగులో పార్టీలు ఉద్దేశపూర్వకంగా మహిళలకు అవకాశాలను నిరాకరిస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే మహిళలకు రాజకీయాలలో ఎక్కువ అవకాశాల్ని కల్పించడానికి చట్టసభలలో మూడో వంతు రిజర్వేషన్లుండాలనే ప్రతిపాదన మళ్లీ వినిపిస్తోంది. ఇటీవల విజయవాడ/అమరావతిలో జరిగిన జాతీయ మహిళా పార్లమెంటు సదస్సులో కూడా ఇదే ప్రధాన చర్చనీయాంశం.




న్యూస్‌టుడే, హైదరాబాద్

ఎన్నికల వేళ చివరి నిమిషంలో... నియోజకవర్గాల ముక్కుమొహం తెలియకున్నా 'సీల్డ్ కవర్‌లోంచి' అభ్యర్థులు ఊడిపడుతున్న కాలమిది.

పార్టీల బి ఫారాల కోసం కొట్లాటలు, ఇద్దరేసి అభ్యర్థుల పోటాపోటీ నామినేషన్లు... వీధిపోరాటాలు... డబ్బు మూటలు... ఇవీ స్వతంత్ర భారతావనిలో ఎన్నికల సమయంలో కనిపించే ఘట్టాలు!

ఇలాంటి వాటికి విరుద్ధంగా నూతన సంస్కృతికి లోక్‌సత్తా తెరతీసింది.

ఎన్నికలకు ముందస్తుగా లోక్‌సత్తా [illegible] ర్గాల [illegible] ల తొలిజాబితాను [illegible] [illegible]నగా, [illegible] అందులో [illegible] మహిళలె కావటం విశేషం.

మహిళలకు చట్టసభల్లో విధిగా మూడోవంతు అవకాశాలు సమంజసమైన వాదనే. మహిళలకు జనాభా ప్రాతిపదికన ప్రజాస్వామ్యయుతంగా అవకాశాలివ్వని ప్రధాన పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఇరవై ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టాయి.

అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించటానికి ముందు కొన్ని లోపాల్ని సరిచేయాల్సుంది. ఈ లొసుగుల్ని సరిచేయకుండా బిల్లును ఆమోదిస్తే కృత్రిమ నాయకత్వాన్ని తయారు చేసినట్టవుతుంది. ప్రజాస్వామ్యానికి ప్రతికూల ఫలితాలు వస్తాయి. 1996లో ప్రతిపాదించిన మహిళాబిల్లును ఇప్పుడు యథాతథంగా ఆమోదించినా కూడా పేరుకే తప్ప మహిళలకు అధికారం రాదు. వారు సమానహక్కుల్ని పొందే వారుగా కాకుండా వివక్షకు గురై అదనపు సదుపాయాల్ని పొందుతున్న ఓ ప్రత్యేకవర్గంగానే మిగిలిపోతారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే మూడోవంతు సీట్లను మహిళలకు కేటాయించాల్సి వస్తుంది.

ఉదాహరణకు లోక్‌సభలో అయితే 181 సీట్లు మహిళలకు ఇవ్వాలి. అయితే ఇది రొటేషన్ పద్ధతి ద్వారా కావటంతో ఏ ఒక్క నియోజకవర్గం నుంచీ ఓ మహిళా అభ్యర్థి వరసగా పోటీచేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంటే సిట్టింగ్ అభ్యర్థుల్లో మూడింట రెండొంతుల మంది ప్రతి సాధారణ ఎన్నికల్లో బలవంతంగా తమ సీటును ఖాళీ చేయాల్సి వస్తుంది. ఒక పురుష అభ్యర్థికి ఈ పరిస్థితి వస్తే, అక్కడ మహిళా అభ్యర్థిగా తన కుటుంబ సభ్యులనే నిలబెడతాడు. ఇది ప్రజాస్వామిక ప్రాతినిధ్య విధానాన్ని దెబ్బతీస్తుంది. ప్రజాప్రతినిధి ఓ నియోజకవర్గాన్ని ఎంచుకుని అక్కడ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలుండవు. మరోసారి అదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యే అవకాశం లేదని తెలిశాక, రాజకీయాలు మరింత బాధ్యతారహితంగా మారిపోతాయి. ఒకవేళ మహిళా అభ్యర్థే అక్కడ జనరల్ అభ్యర్థిగా పోటీ చేయాలంటే మొత్తం సీట్లన్నీ మహిళలే ఉండే పరిస్థితి

వస్తుంది.. ఈ లోటుపాట్ల న్నిటిన్నిటినీ అధిగమించా లంటే, రిజర్వేషన్ బాధ్యతని రాజకీయ పార్టీలకి వర్తింపచేయటం మేలు.

ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ మూడోవంతు నియోజకవర్గాల్లో మహిళా అభ్యర్థుల్ని నిలబెట్టేలా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలి. స్థానిక రాజకీయం, సామాజిక సమీకరణలకు అనుగుణంగా ఎక్కడ మహిళా అభ్యర్థుల్ని నిలబెట్టాలో ఆయా పార్టీలు నిర్ణయించుకోవచ్చు. మహిళా ప్రాతినిధ్యం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలలో ఉండేలా చూసేందుకు, ప్రతి మూడు లోక్‌సభ స్థానాలను ఒక యూనిట్‌గా చేసి అందులో మహిళలకు మూడోవంతు (ఒక ఎంపీ సీటు) ఇచ్చేలా చూడాలి. జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని యూనిట్‌గా ఈ ప్రాతిపదికను పాటించాలి. గుర్తింపు పొందిన ఏ పార్టీ అయినా అలా మూడో వంతు మహిళా అభ్యర్థుల్ని నిలబెట్టక పోతే, అందుకు పరిహారంగా కొన్ని సీట్లు కోల్పోవాల్సి ఉంటుంది.

ఈ సవరణలతో పాటు రాజ్యసభ, విధానపరిషత్తుల్లో కూడా విధిగా మహిళలకు మూడోవంతు సీట్లు ఎన్నిక ద్వారా లేదా నామినేషన్ ద్వారా కేటాయిస్తే మహిళలకప్రాతినిధ్యానికి అవకాశాలు బాగా మెరుగవుతాయి. 1998లోనే లోక్‌సత్తా ఇందుకు సమగ్ర చట్టాన్ని రూపొందించింది. చాలా రాజకీయ పార్టీలు, ఎన్నికల సంఘం ఈ నమూనాని ఆహ్వానించాయి. అయితే ఇంకా ఏకాభిప్రాయం రాలేదు. ఈ పరిస్థితుల్లో పార్టీలను వంచాల్సిన బాధ్యతను మహిళలు తీసుకోవాలి. చట్టం చేసే దాకా ఎందుకు, మీరు మహిళలకు ఎందుకు సీట్లు ఇవ్వరు అని ప్రశ్నించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించే పార్టీలకే ఓట్లు వేయాలి.

ఇంతకుముందే చెప్పుకున్నట్టు.. జాతీయ, రాష్ట్రస్థాయిలో మనకు బలమైన మహిళానేతలు కొందరైనా ఉన్నారు. కానీ వీరిలో కూడా ఎక్కువమంది వ్యక్తిగత స్థాయి నాయకురాళ్లే. అందుకే ఈ దేశంలో రావాల్సినంత మార్పు రాలేదు. కోట్లాది మంది మహిళల స్థితిగతులూ గొప్పగా ఏమీ మారలేదు. ఆర్థిక కార్యకలాపాల విషయాన్నే తీసుకుంటే.. 145 దేశాల మధ్య మనదేశం 139వ స్థానంలో ఉందని నివేదికలు చెబుతున్నాయి. పురుషులతో పోలిస్తే తక్కువ ప్రతిఫలం లభించే వివక్షతోపాటు, ఆ ఉపాధి అవకాశాలు కూడా స్త్రీలకు తగ్గటం ఆందోళనకరం. ఇక భద్రత సంగతి వివరించనక్కర్లేదు. కాబట్టి.. మహిళలందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే వ్యవస్థీకృత మార్పుని సాధించే నాయకత్వ స్థాయికి మహిళలు ఎదిగే అవకాశాల్ని కల్పించటం ఇప్పుడున్న అసలైన సవాలు. అది సాధ్యమైతేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

**కోట్లాది మంది మహిళల స్థితిగతులూ గొప్పగా ఏమీ మారలేదు. ఆర్థిక కార్యకలాపాల విషయాన్నే తీసుకుంటే.. 145 దేశాల మధ్య మనదేశం 139వ స్థానంలో ఉందని నివేదికలు చెబుతున్నాయి. పురుషులతో పోలిస్తే తక్కువ ప్రతిఫలం లభించే వివక్షతోపాటు, ఆ ఉపాధి అవకాశాలు కూడా స్త్రీలకు తగ్గటం ఆందోళనకరం. ఇక భద్రత సంగతి వివరించనక్కర్లేదు. కాబట్టి.. మహిళలందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే వ్యవస్థీకృత మార్పుని సాధించే నాయకత్వ స్థాయికి మహిళలు ఎదిగే అవకాశాల్ని కల్పించటం ఇప్పుడున్న అసలైన సవాలు. అది సాధ్యమైతేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది.**

మహిళా విధానం కోసం కమిటీలు వేస్తుంటారు. ఈ ఏడాది కూడా వేసినట్టు వార్తలొచ్చాయి. విధివిధానాల్లో ఉన్న చదువు, ఆరోగ్యం వంటి అంశాలు పైకి బాగానే కనిపిస్తున్నాయి. కానీ అవి అధికారికంగా ఇప్పటికే చాలామందికి ఉచితంగా అందుతున్నాయి. సమస్యల్లా ఫలితాలతోనే. కాబట్టి చిత్తశుద్ధి ఉంటే.. మహిళా సాధికారతకు నిజమైన కృషి మొదలుపెట్టాలి. అందుకు తగ్గ విధానాల్ని రూపొందించాలి. నిజానికి మహిళాభ్యుదయం కోసం చేసే కృషితో.. మహిళలు, పురుషులు తేడా లేకుండా దేశంలోని అనేక అసమానతలు, ఇతర సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. అందుకే మహిళా సాధికారత కోసం చేసే కృషిలో మగవారినీ భాగస్వాముల్ని చేయటం అవసరం.

చట్టబద్ధ పాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, న్యాయ, పోలీసు సంస్కరణలు, పార్టీల్లో, చట్ట సభల్లో, పాలనలో ప్రజాస్వామిక భాగస్వామ్యం .. మహిళల నిజమైన సాధికారతకు కీలకమైన ఈ ఎజెండా కోసం మాటల్లో, చేతల్లో కృషి చేసిన వ్యక్తిగా, రాజకీయ ఉద్యమకారునిగా లక్ష్యసాధన పట్ల ఎంతో ఆశాభావంతో ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియచేస్తున్నాను. ★

# ప్రాతినిధ్యం + పరిష్కార శక్తి = సాధికారత

**చట్టసభలలో మహిళలకు జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం కల్పించే స్థాయిలో రాజకీయ పార్టీల నిర్మాణం, వ్యవహారశైలి ఉంటే.. పురుషుల కంటే వేగంగా మహిళలు ఈ పరిష్కారాల్లో భాగం కాగలుగు తారనటంలో సందేహం లేదు. ఎందుకంటే, సాంప్రదాయ పురుష రాజకీయ నేతలతో పోలిస్తే చాలామంది మహిళా నేతలు మనదేశంలో మెరుగైన రాజకీయ సంస్కృతిని, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకే రాజకీయాలలో, చట్టసభలలో మహిళల ప్రాతి నిధ్యాన్ని 50శాతానికి పెంచటం కేవలం ప్రజాస్వామిక అవసరమే కాకుండా, మనదేశం లో మంచి రాజకీయానికి కూడా కీలకమని గుర్తించాలి.**





**"మా** దేశంలో అధ్యక్షురాలు, స్పీకర్, ప్రతిపక్ష నేత, ఎలక్షన్ కమిషనర్ ఇలా కీలకస్థానాలన్నింటిలోనూ మహిళలే ఉన్నారు. అయినా మా దేశం మహిళాభివృద్ధి సూచిపరంగా వెనకబడే ఉంది. ఇప్పటికీ బంగ్లాదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం పెరగకపోవటమే ఇందుకు కారణం".. మహిళా సాధికారతపై ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సదస్సులో బంగ్లాదేశ్ ఉప సభాపతి షిరీన్ షర్మిన్ చెప్పిన ఈ మాటల్లోనే మహిళల వెనకబాటుతనం సహా భారత్‌లోని అనేక సమస్యలకు పరిష్కారం దాగుంది.

మనదేశంలో 'జనాభాలో సగం – అవకాశాల్లో సగం' అనే నినాదం ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చినా, అనేక రంగాలలో దూసుకుపోతున్నా, రాజకీయాలలో మాత్రం అంత పెద్దఎత్తున మహిళల ప్రవేశం లేదు. చట్టసభలలో ఇంకా తక్కువ. ఉన్న మహిళలు కూడా జాతి నిర్మాణం చేయగల స్థాయిలో రాజకీయాలలో పెద్దగా రాణించలేకపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం – పరిష్కారాల పట్ల లోతైన అవగాహనను ప్రదర్శించక పోవటం! షిరీన్ షర్మిన్‌లా కొందరు పరిష్కారాలను గుర్తించినా.. దాన్ని సాధించేందుకు కావలసిన సంస్కరణల్ని అర్థం చేసుకుని ఒడుపుగా సాధించే సత్తాని కనబరచ లేకపోతున్నారు. అందుకే, మన దేశంలో కీలక పదవుల్లో కొందరు మహిళలకు అవకాశాలు వచ్చినా, రాజకీయాలను ప్రక్షాళన చేయలేక పోతున్నారు.

నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానిక ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తి, చట్టబద్ధపాలన వంటి అంశాల మీద మహిళా నేతలు దృష్టి సారిస్తే కచ్చితంగా మహిళా నాయకత్వం నిజమైన సత్తాను ప్రదర్శించగలుగుతుంది. కోట్లాది మహిళలకు ఎదిగే అవకాశాలనందించే గొప్ప నాయకత్వంగా తయారవ గలుగుతుంది. ఈ పరిష్కారాలు పురుషుల్లోనూ పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని ఆవిష్కరించగలిగేవి కాబట్టి వీటిని అమలుచేసే మహిళా నాయకత్వంతో ఈ దేశ సుస్థిరాభివృద్ధి కూడా సాకార మవుతుంది.

కానీ ఇటీవలి అమరావతి జాతీయ మహిళా పార్లమెంటు

సదస్సు కూడా ఈ పరిష్కారాల మీద పెద్దగా దృష్టి పెట్టలేదు. సదస్సుకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోడలు బ్రాహ్మణి కూడా షిరీన్ షర్మిన్ చెప్పిన పరిష్కారాన్నే చెప్పారు. నాణ్యమైన చదువుంటేనే మహిళలు ఎదగ గలుగుతారని, తలెత్తుకుని బతక గలుగుతారని తేల్చారు. కానీ బ్రాహ్మణికి లభించినంత నాణ్యమైన చదువు తెలుగు నాట ఎంతమంది బిడ్డలకు అందుతోంది అన్న ప్రశ్న ఆమెకు, చివరకు ఆ సభను అలంక రించిన, సభలో పాల్గొన్న ప్రముఖులకు తట్టలేదు. తెలిసిన వారు తట్టనట్టు నటించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో ఒక్క మహిళకూ ప్రాతినిధ్యం లేకపోయినా, సదస్సుకొచ్చిన తెరాస ఎంపీ కల్వకుంట్ల కవితనుద్దేశించి ఆ అంశాన్ని ఎవరూ ప్రస్తావించ లేకపోయారు. మహిళల రక్షణకు కీలకమైన స్థానిక న్యాయస్థానాల ఏర్పాటును మాట్లాడకపోగా, వైసీపీ ఎమ్మెల్యే రోజా చట్టబద్ధ హక్కుని కాలరాస్తూ అరెస్టు చేశారు. రాజును మించిన రాజభక్తిని ప్రదర్శిస్తున్న పోలీసులను అదుపుచేయకుండా వదిలేస్తే, చంద్రబాబుతోపాటు రాష్ట్రానికీ చెడ్డపేరు వస్తుంది. రోజా రచ్చ చేస్తారన్న సమాచారం ఉన్నా సరే, ఆమెను ముందస్తు అరెస్టు చేయటం జాతీయ మహిళా పార్లమెంటులోనే మహిళల పౌరహక్కుల్ని కాలరాయటం. తమకు మరింత గౌరవం కావాలని పలువురు విద్యార్థినులు, ఉన్నత విద్య చదివిన యువతులు, మహిళలు సైతం సదస్సు చర్చల్లో, ఆన్‌లైన్ సర్వేలో చెప్పినా పరిష్కారాల కోసం లోతైన చర్చ చేసే ప్రయత్నం కనిపించలేదు. మహిళల సమస్యలకు నిజమైన పరిష్కారాలను పరిష్కా రాలను ప్రస్తావించగలవారిని, అందుకోసం ఏళ్ల తరబడి పని చేస్తున్నవారిని సదస్సుకు ఆహ్వానించలేదనే విమర్శలు కూడా బలంగా వినిపించాయి. ఈవెంట్ మేనేజర్లకు, కొన్ని మీడియా సంస్థలకు మాత్రం బాగా గిట్టు బాటైందని చెప్పుకుంటున్నారు. ఎవరి జేబులోకి ఎంత వెళ్లిందోగానీ.. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్వహించిన సదస్సును నిర్మాణాత్మక కార్యాచరణ తీర్మానాలేవీ లేకుండానే ముగించేశారు.



| ఎక్కువశాతం మహిళా ఎంపీలున్న దేశాలు | | |
|---|---|---|
| స్థానం | దేశం | శాతం |
| 1 | రువాండా | 63.9 |
| 2 | బొలీవియా | 53.1 |
| 3 | క్యూబా | 48.9 |
| 4 | ఐస్‌ల్యాండ్ | 47.6 |
| 5 | నికరాగువా | 45.7 |
| 6 | స్వీడన్ | 43.6 |
| 7 | సెనెగల్ | 42.7 |
| 8 | మెక్సికో | 42.4 |
| 9 | దక్షిణాఫ్రికా | 42 |
| 10 | ఈక్వడార్ | 41.6 |

### 145వ స్థానం

చట్టసభలలో మహిళలకు జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం కల్పించే స్థాయిలో రాజకీయ పార్టీల నిర్మాణం, వ్యవహారశైలి ఉంటే.. పురుషుల కంటే వేగంగా మహిళలు ఈ పరిష్కారాల్లో భాగం కాగలుగుతారనటంలో సందేహం లేదు. ఎందుకంటే, సాంప్రదాయ పురుష రాజకీయ నేతలతో పోలిస్తే చాలామంది మహిళా నేతలు మనదేశంలో మెరుగైన రాజకీయ సంస్కృతిని, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకే రాజకీయాలలో, చట్టసభలలో మహిళల ప్రాతి నిధ్యాన్ని 50శాతానికి పెంచటం కేవలం ప్రజాస్వామిక అవసరమే కాకుండా, మనదేశం లో మంచి రాజకీయానికి కూడా కీలకమని గుర్తించాలి.

కానీ.. ఎన్నికలలో కూడా మహిళల గెలుపు శాతం పురుషుల కంటే బాగానే ఉన్నా (2014 లోక్‌సభ ఎన్నికల్లో పురుషుల విజయశాతం 6.4శాతం కాగా, మహిళల గెలుపుశాతం 9.3) మనదేశంలో రాజకీయ పార్టీలు కల్పిస్తున్న మహిళలకు కల్పిస్తున్న అవకాశాలు మాత్రం చాలా తక్కువేనని, ప్రోత్సాహం

అంతంతమాత్రమేనని వాస్తవాలు వెల్లడిస్తున్నాయి.

మహిళా ఎంపీల విషయంలో భారత్ 145వ స్థానంలో ఉంది.

భారత్‌లో మహిళా ఎంపీల శాతం 11.6శాతం కాగా, పేరు వినగానే మనం చప్పరించేసే రువాండా, బొలీవియా దేశాల్లో 50శాతానికి పైగా ఉంది.

ప్రస్తుతం మనదేశంలోని ఉభయ సభల్లో మొత్తం ఎంపీ సీట్లు 787 కాగా, మహిళా సభ్యుల సంఖ్య 91. లోక్‌సభలోని 543 స్థానాలలో మహిళలు 64 మంది (12శాతం) ఉన్నారు. రాజ్యసభలోని 244 సీట్లలో మహిళలు 27మంది (11.1శాతం) ఉన్నారు.

బ్రిక్స్ దేశాల్లో కూడా మనదే చివరి స్థానం.

బ్రిక్స్‌లో ఇతర సభ్యులైన దక్షిణాఫ్రికాలో 38.6శాతం, చైనాలో 23.6శాతం, రష్యాలో 14.9శాతం, బ్రెజిల్‌లో 13శాతం మహిళా ఎంపీలున్నారు.

పొరుగుదేశాలైన నేపాల్ (29.6శాతం మహిళా ఎంపీలు), ఆఫ్ఘనిస్తాన్ (27.1), చైనా (23.6), బంగ్లాదేశ్ (20), పాకిస్తాన్ (19.5) మనకంటే మెరుగ్గా ఉన్నాయి.

నాగాలాండ్ రాష్ట్రంలో ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేదు.

**ఖండాలు, ప్రాంతాలపరంగా**

ఆసియాలో మహిళా ఎంపీల శాతం: 19.5

ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో: 27.8

| | |
|---|---|
| ఐరోపా | : 25.9 |
| సబ్ సహారా | : 23.5 |
| అరబ్ దేశాల్లో | : 19.1 |
| పసిఫిక్ దేశాల్లో | : 14.2 |

ప్రపంచవ్యాప్తంగా మొత్తం 46,048 మంది సభ్యులు జాతీయ స్థాయిలో (ఎంపీలు/సెనేటర్లు తదితర పేర్లతో) ఉండగా, అందులో 10,526 మంది (23శాతం) మహిళలు ఉన్నారు.

ఇక్కడ మహిళలకు కోటాపై కూడా ఆందోళనలు జరుగుతున్నాయి. భారత్‌లో ఎక్కువగా మహిళా శాసనసభ్యులు బీహార్, రాజస్తాన్, హర్యానా రాష్ట్రాల్లో ఉన్నారు.

రాజ్యాంగం ఇచ్చిన సాధికారత హక్కు చిట్టచివరి మహిళకు కూడా సమకూరటానికి.. స్త్రీలు ప్రాతినిధ్యం, పరిష్కారశక్తిని పెంచుకోవటం కీలకమన్నదే ఈ వాస్తవాల సారాంశం. ★

# మల్లయ్యకొండ ప్రాంతంలో మైనింగ్ తగదు




సాధుకొండ, మల్లయ్యకొండ, ఇనుముకొండ ప్రాంతాల్లో మైనింగ్ వల్ల జనజీవనానికి, పర్యావరణానికి నష్టం వస్తుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నా, ప్రభుత్వం మొండిగా ఖనిజాన్వేషణ మొదలుపెట్టటం తగదని లోక్‌సత్తా పార్టీ తంబళ్లపల్లె నేతలు హెచ్చరించారు. సంబంధిత జీవోను వెనక్కుతీసుకోవాలన్నారు. సీపీఐ, జనసేన నాయకులతో కలిసి వారు సాధుకొండ పరిసరప్రాంతాలైన బోదగుండ్లపల్లె, కేచిరెడ్డిగారిపల్లె, తిరుమలరెడ్డిపల్లె, ఎగువ బోయపల్లెలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంకు చెందిన పర్యావరణ అధ్యయనకారులు అనీల్ కుమార్, వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. ★

# రాజకీయాలను పవిత్ర వ్యాసంగంగా మార్చటానికి మహిళల క్రియాశీలపాత్ర అవసరం

- రవి రాఘవేందర్,
యూత్ పార్లమెంట్ కో ఆర్డినేటర్



పార్లమెంటులోగానీ, శాసనసభలోగానీ, ప్రభుత్వాలలోగానీ, రాజకీయాలలోగానీ బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచటంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తారు. సెంటిమెంటల్ సందర్భాలలో కాకుండా సమాజంలో సగభాగంగా, ఒక అవగాహనతో మహిళలు రాజకీయాలలోకి వస్తేనే కొత్త రాజకీయ సంస్కృతి బలపడుతుంది. అరచుకోవటం, గందరగోళం కాకుండా హేతుబద్ధమైన వాదనలతో, వాస్తవాలతో ప్రజాసంక్షేమానికి అనుగుణంగా చర్చల్ని మళ్లించటం ఇలాంటి మహిళలు చేయగలరు. అప్పుడు అధికారానికి అర్థం మారుతుంది. నిజానికి అధికారం అంటే విద్యను, ఆరోగ్యాన్ని, చట్టబద్ధ పాలనని అందించటం కావాలి, నైపుణ్యాలను పెంచడం కావాలి, ప్రతి వ్యక్తీ ఎదగడం కావాలి. అందుకోసం మహిళా సాధికారత అవసరం.

మనదేశంలో, రాష్ట్రంలో సగభాగం మహిళలున్నారు. మీరు అంతా తలచుకుంటే దేశ చరిత్ర, నిర్మాణం మారిపోతుంది. తొలి ఆధునిక సమాజం మొదలయిననాటికి స్వాతంత్ర్యం పొందిన మొదటి దేశాలలో మహిళలకు సరైన గౌరవం దక్కలేదు. ప్రపంచం మొత్తంలో మన భారతదేశ స్త్రీలకు మాత్రమే రాజ్యాంగం రాసిన తొలినాటికే వారికీ సమానత్వం ఇచ్చారు. చరిత్రను ఒక్కసారి చూస్తే దాదాపు 215 సంవత్సరాల క్రితం అమెరికాలో రాజ్యాంగం వచ్చాక మహిళలకు ఓటుహక్కు లభించింది. ఆ దేశ రాజ్యాంగం రాస్తున్నప్పుడు అబిగేయిల్ యాడమ్స్ అని, ఆ దేశ రాజ్యాంగ నిర్మాణంలో కీలకపాత్ర పోషించినవారిలో ఒకరైన జాన్ యాడమ్స్‌గారి భార్య.. ఆమె భర్తకు ఉత్తరం రాస్తూ, "మీరు గొప్ప రాజ్యాంగాన్ని ప్రపంచంలో మొదటిసారిగా రాస్తున్నారు. దయచేసి మా మహిళల సంగతి మరచిపోకండి" అని రాశారు. అయినా వాళ్లు మరచిపోయారు. అలాగే బ్రిటన్‌లో 500 సంవత్సరాల పోరాటంతో 1928లో మహిళలకు ఓటుహక్కు వచ్చింది. ఫ్రెంచ్‌కి 1790లో స్వతంత్ర వచ్చాక చాలాకాలం మహిళలు సమానత్వం, హక్కుల కోసం పోరాటం చేసి సాధించుకున్నారు.

అలాంటిది మనదేశంలో రాజ్యాంగం వచ్చిన తొలిరోజునే, కులం, మతం, భాష, ప్రాంతం, లింగం వివక్షలేవీ లేకుండా వయోజన ఓటు హక్కు ఇస్తూ మహిళలకు ఓటుహక్కును సాకారం చేశారు. ప్రపంచ రాజ్యాంగాలలో మహిళలకు రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే ఓటు హక్కు ఇచ్చిన తొలి రాజ్యాంగం భారత రాజ్యాంగం.

ఓటుహక్కు ఉన్నా కూడా స్వాతంత్ర్యం వచ్చిన తొలినాటి నుంచి మనదేశ రాజకీయాలలో మగవారితో పోటీ పడటంలో మహిళలు వేగంగా ఎదగలేకపోయారుగానీ ఆధునిక సమాజంలో మిగిలినరంగాలలో గణనీయమైన పురోగతినే సాధిస్తున్నారు. వారి వ్యక్తిగత జీవితాలను బాగు చేసుకోవటమేకాకుండా కుటుంబ బాధ్యతలను కూడా చూసుకుంటూ సమాజంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించే మహిళల సంఖ్య పెరుగు తోంది. ఆర్థికరంగంలో మహిళల పాత్ర పెరుగుతోంది. వ్యవసాయంలోనూ తమదైన ప్రభావం చూపుతున్నారు. కానీ అతి కీలకమైన రాజకీయ రంగంలో భూస్వామ్య వ్యాపార ధోరణులు మహిళలకు తీవ్ర ప్రతిబంధకాలుగా

మారాయి. డబ్బులేనివారు ఎంత నిజాయతీపరులు, సమర్థులైనా రాజకీయాలలో రాణించలేని పరిస్థితులు మహిళల పట్ల కూడా శాపంగా మారాయి.

ఎన్నికైన మహిళా ప్రతినిధులు మహిళల కోసం కృషి చేస్తారని మాటవరసకు అనుకున్నా, మనదేశంలో ఉన్న 63 కోట్లమంది మహిళల తరపున వారి సమస్యలను పరిష్కరించడానికి, హక్కులను కాపాడటానికి లోక్‌సభలో కేవలం 65 మంది మాత్రమే ఉన్నారు. లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం 12శాతం మాత్రమే ఉండగా రాజ్యసభలోనూ అదేస్థాయిలో ఉంది. ఎగువసభలో 31మంది మహిళలున్నారు. ఎంతోకాలంగా మనదేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు (33శాతం విధిగా మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు) పార్లమెంటు ఆమోదించలేకపోతోంది. ఇప్పుడున్న ప్రభుత్వాలు మహిళల మీద కపట ప్రేమను చూపుతున్నాయి తప్ప వాటిని అమలు చేయటానికి మాత్రం వారికి చేతులు రావటం లేదు. సమస్యల మీద ఆలోచించకుండా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు.

మనకన్నా పాకిస్తాన్‌లో మహిళలకు రాజకీయాల్లో ఎక్కువ ప్రాతినిధ్యం కనిపిస్తోంది. పాకిస్తాన్ దిగువసభలో మహిళలు 2013లో మొత్తం 340మంది సభ్యులకుగాను 70మంది ఉన్నారు. వీరి శాతం 20.6గా ఉంది. రాజ్యసభలో 2015లో 104మంది సభ్యులకుగాను 19మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ మహిళా భాగస్వామ్యం 18.3శాతంగా ఉంది.

చైనా పార్లమెంటులో మొత్తం సభ్యులు 2959కిగాను 699 మంది మహిళా ప్రతినిధులున్నారు. మొత్తంగా 23.6శాతం మంది మహిళలు అధికారం చేపడుతున్నారు. (మహిళల సాధికారత కోసం ఇరవయ్యేళ్ల క్రితం బీజింగ్ డిక్లరేషన్‌లో పేర్కొన్న లక్ష్యాలను వేగవంతం చేయాలని ఇటీవల చైనా అధ్యక్షుడు అంతర్జాతీయ వేదిక మీద కూడా పునరుద్ఘాటించారు)

ఇక మన కేంద్ర కేబినెట్‌లో ఏడుగురు మహిళా మంత్రులున్నారు, అంటే మొత్తంగా 26శాతం మాత్రమే వారికి దక్కింది.

మన తెలుగురాష్ట్రాల విషయానికొస్తే, మహిళల మీద అధికార పార్టీ చూపుతున్న నిర్లక్ష్యం నభూతో. అంత సమానత్వ స్పృహ, ప్రజాస్వామిక భావన లేనివారు మనల్ని పరిపాలిస్తున్నారేమి అనే సందేహం కలుగుతుంది.

తెలంగాణలో 2014లో ఎన్నికలు జరిగినప్పుడు ఇప్పుడున్న అధికార పార్టీ, ప్రతిపక్షాలు ఎమ్మెల్యే టికెట్టు జాబితాలో 21మంది మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇచ్చారు.

తెలంగాణ శాసనసభకు 9మంది మాత్రమే మహిళా సభ్యులు ఎన్నికయ్యారు. అన్నిటికన్నా దురదృష్టం తెలంగాణ రాష్ట్ర సమితి ఏ ఒక్క మహిళకూ మంత్రివర్గంలో స్థానం కల్పించలేదు. మహిళలకు సమానావకాశాలు ఇవ్వలేని వాళ్లు విశ్వ గురువులమని, బంగారు తెలంగాణ తెస్తామని కబుర్లు చెబుతున్నారు. ఢిల్లీలో వందలకోట్ల జనం సొమ్ముతో ప్రచారం చేసుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా మహిళల పట్ల ఇదేతరహా వివక్షను ప్రదర్శిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలకుగాను 20 మంది మహిళలు శాసనసభకు ఎన్నికయ్యారు. ఏపీ కేబినెట్‌లో ఉన్న ఇరవై మందిలో ఇద్దరు మహిళలకు మాత్రమే మంత్రి పదవులు లభించాయి.

కేవలం కొన్ని సెంటిమెంటల్ సందర్భాలలో మగవారి స్థానంలో మహిళలు వచ్చేసి రాజకీయాలలో పాత్ర తీసుకునే పరిస్థితికి తీసుకొచ్చారు. రాజకీయం అంటే నేరప్రవృత్తి, అవినీతి, రాజకీయం మారదు అనే భావన ప్రజల మనసుల్లో చొరబడిపోయింది. దాని నుండి బైటపడటానికి మహిళలు నాయకత్వం తీసుకోవటం అవసరం. రాజకీయాలను పవిత్ర వ్యాసంగంగా మార్చటానికి మహిళల క్రియాశీల పాత్ర ఎంతో అవసరం. పార్లమెంటులోగానీ, శాసనసభలోగానీ, ప్రభుత్వాలలోగానీ, రాజకీయాలలోగానీ బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచటంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తారు. సెంటిమెంటల్ సందర్భాలలో కాకుండా సమాజంలో సగభాగంగా, ఒక అవగాహనతో మహిళలు రాజకీయాలలోకి వస్తేనే కొత్త రాజకీయ సంస్కృతి బలపడుతుంది. అరచుకోవటం, గందరగోళం కాకుండా హేతుబద్ధమైన వాదనలతో, వాస్తవాలతో ప్రజాసంక్షేమానికి అనుగుణంగా చర్చల్ని మళ్లించటం ఇలాంటి మహిళలు చేయగలరు. అప్పుడు అధికారానికి అర్థం మారుతుంది. నిజానికి అధికారం అంటే విద్యను, ఆరోగ్యాన్ని, చట్టబద్ధ పాలనని అందించటం కావాలి, నైపుణ్యాలను పెంచడం కావాలి, ప్రతి వ్యక్తీ ఎదగడం కావాలి. అందుకోసం మహిళా సాధికారత అవసరం. సమాజంలో ఈ సాధికారత వేగంగా రూపుదాల్చటంలో.. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చొరవతో ప్రారంభమైన యూత్ పార్లమెంట్ తన వంతు కృషిని చేస్తోంది. ★

# మహిళల ప్రాతినిధ్యానికి ప్రత్యామ్నాయ మార్గాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

చట్టసభలలో మహిళలకు మూడోవంతు ప్రాతినిధ్యం కల్పించాలని చాలామంది కోరుకుంటున్నా, ప్రస్తుతం ప్రవేశ పెడుతున్న ప్రతిపాదనల వల్ల ఎన్నో ఇబ్బందులున్నాయి. ఒక నియోజక వర్గాన్ని శాశ్వతంగానో, తాత్కాలికంగానో మహిళలకే కేటాయిస్తే నాయకత్వం సహజంగా ఎదిగే అవకాశం ఉండదు. ప్రస్తుతం పార్టీలలో పలుకుబడి ఉన్న పెద్దలే తమ భార్యలనో, కుమార్తెలనో, ఇతర సమీప బంధువులనో అభ్యర్థులుగా నియమించాలని ప్రయత్నిస్తారు. గెలిచే అవకాశమున్న ప్రధాన పార్టీలు ఆ విధంగా చేయటంతో పౌరులకు సరైన అభ్యర్థులు లభించరు. చివరికి ఎవరు గెలిచినా అందులో మహిళలకు ఒరిగేదేమీ ఉండదు. మహిళలతో సహా అన్ని రిజర్వేషన్లు కలిపి దాదాపు 50శాతానికి చేరటంతో రొటేషన్ పద్ధతిని అమలు చేయాల్సి ఉంటుంది. దాంతో ఒకసారి పోటీచేసిన, లేదా గెలిచిన ఏ అభ్యర్థీ తరువాత ఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉండదు. దాంతో గెలిచినవాళ్లు మరీ పేట్రేగిపోయి, ప్రజల పట్ల ఏమాత్రమూ భయం, గౌరవం లేకుండా జాతి ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రమాద ముంది. మంచివాళ్లు ఎన్నికయినా, మళ్లీ పోటీచేసే అవకాశం లేక నీరసించి పోతారు. ఎవరూ వరసగా రెండోసారి సభ్యులయ్యే అవకాశం లేకపోవటంతో చట్టసభలు, ప్రభుత్వాలు అంతా కొత్తవాళ్లతో, పాలన అనుభవం లేనివాళ్లతో నిండిపోతాయి. ప్రభుత్వ నిర్వహణ మరింత గందరగోళం అవుతుంది. రాజకీయ నాయకత్వం ఎప్పటికప్పుడు కృత్రిమంగా, అసహజంగా, లాటరీలాగా తయారవుతుంది. ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించటం కోసం మరింత సమంజసమైన సమర్థమైన ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి. అలాంటి మూడు ప్రత్యామ్నాయాలను పరిశీలించటం ఈ వ్యాసం ఉద్దేశం.

## బహుళ సభ్య నియోజకవర్గాలు

మొదటి ప్రత్యామ్నాయం బహుళ సభ్య నియోజకవర్గాలు. ఉదాహరణకు మన రాష్ట్రాన్నే తీసుకుంటే, ఇక్కడి 42 పార్లమెంటు నియోజకవర్గాలను 14 బహుళ సభ్య నియోజకవర్గాలుగా మార్చవచ్చు. అలాంటి ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ముగ్గురు ఎన్నికవుతారు. వారిలో ఒక స్థానం విధిగా మహిళలకు కేటాయించవచ్చు, అవసరాన్ని బట్టి కొన్ని నియోజక వర్గాలలో మరో స్థానం దళితులకు, గిరిజనులకు కేటాయించ వచ్చు. మిగిలిన ఒకటి, లేదా రెండు స్థానాల కోసం మిగిలినవారు పోటీ పడవచ్చు. ప్రతి ఓటరుకు ముగ్గురు అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. కేటాయింపులను బట్టి, ఏ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు వస్తే ఆమె మహిళా సభ్యురాలుగా ఎన్నికవుతారు. గిరిజనులు, దళితులకు ఒక స్థానం కేటాయిస్తే, ఆ వర్గాల అభ్యర్థులలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు సభ్యులవుతారు. గిరిజన, దళితుల స్థానాలలోనూ మూడోవంతు మహిళలకు కేటాయిస్తారు. మిగిలినవారిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే, వారిలో ఒకరు, లేదా ఇద్దరు రిజర్వేషన్ లేని స్థానాల నుంచి ఎన్నికవుతారు. ఇందువల్ల ప్రతి పౌరునికి మహిళా సభ్యులను రొటేషన్ పద్ధతిపైన దళిత, గిరిజన సభ్యులను ఎన్నుకునే అవకాశం లభిస్తుంది. ఓటర్లు తమ ఇష్టాయిష్టాలను బట్టి, అభ్యర్థుల గుణగణాలను బట్టి ఒక్కో వర్గంలో ఒక్కో పార్టీకి చెందినవారికి ఓటు వేయవచ్చు. అలాగే అన్ని వర్గాల వారికి ప్రతి నియోజకవర్గంలో పోటీచేసే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ఎన్నికలలో



అభ్యర్థుల గుణశీలాలకు విలువ పెరుగుతుంది. ఇదేదో చాలా గందరగోళంగా, క్లిష్టంగా ఉంటుందని భయపడనక్కర్లేదు. 1952, 1957 సంవత్సరాలలోనే మొదటి రెండు సాధారణ ఎన్నికలలో దళిత, గిరిజన స్థానాల రిజర్వేషన్లను ఈ విధంగా అమలు చేశారు. ఆనాటితో పోలిస్తే గత 45 సంవత్సరాలలో ప్రజలలో అక్షరాస్యత, రాజకీయ అవగాహన పెరిగాయి. అప్పుడే సాధ్యమయిన బహుళ సభ్యత్వ నియోజకవర్గాలు ఇప్పుడు అమలు చేయటం మరింత సులువు. బహుళ సభ్య నియోజకవర్గాల వల్ల రెండు సమస్యలున్న మాట నిజం. మొదటిది, నియోజకవర్గాల పరిధి పెరిగి ఎన్నిక నిర్వహణ కొంత కష్టమవుతుంది. ఎన్నికయిన సభ్యులకు, ప్రజలకు ఎడం పెరిగే అవకాశముంది. ప్రజలకు ఒకరికి బదులు ముగ్గురు ప్రతినిధులు వ్యవహరించినా, కొంత ఇబ్బంది ఉండవచ్చు. రెండవది, ఈ పద్ధతి చాలామంది ఓటర్లకు, అందునా అక్షరజ్ఞానం లేనివారికి కొంత తికమకగా అనిపించవచ్చు. ఇబ్బందులు కొంతమేరకు ఉన్నప్పటికీ, మహిళల కోసం, దళిత, గిరిజన సభ్యుల కోసం కొన్ని నియోజకవర్గాలను కేటాయించటం కంటే ఈ బహుళ సభ్యత్వ నియోజకవర్గాలు ఎంతో ఉత్తమం. ఇందులో నాయకత్వం మరింత సహజంగా, సాఫీగా అభివృద్ధి చెందుతుంది. ఓటర్లకు అభ్యర్థులను ఎంచుకునే అవకాశం పెరుగుతుంది. అన్ని సీట్లు ఒకే పార్టీకి కాక, నిలబడ్డ అభ్యర్థులను బట్టి వివిధ పార్టీల వారికి ఒకే ఓటరు ఓటు వేసే అవకాశం కలుగుతుంది. బండగా పార్టీల అగ్రనాయకులకో, పార్టీల గుర్తులకో ఓటు వేయటం కాక, కాస్త ఆలోచించి అభ్యర్థుల్ని ఎంచుకునే సంప్రదాయం బలపడుతుంది.

**దామాషా పద్ధతి ఎన్నిక**

మహిళలకు, దళితులు, గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి దామాషా పద్ధతి ఎన్నిక మరో మార్గం. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఉన్న 42 పార్లమెంటు స్థానాలలో 21 లేదా 22 స్థానాలను నియోజకవర్గాలలో ఎన్నిక ద్వారా ఇప్పటి మాదిరిగానే భర్తీ చేయవచ్చు. ఇందులో నియోజకవర్గాల సంఖ్య తగ్గి, పరిధి పెరుగుతుంది. మిగిలిన 20 లేదా 21 స్థానాలను నిర్దేశించిన శాతం మేరకు 14 మహిళలకు, మిగిలినవి దళితులకు, గిరిజనులకు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రం మొత్తంలో ఆయా పార్టీలకు వచ్చిన మొత్తం ఓట్ల శాతాన్ని పరిగణలోకి తీసుకుని ఈ సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు నాలుగు ప్రధాన పార్టీలకు 40, 40, 15, 5శాతం చొప్పున ఓట్లు వచ్చాయనుకుందాం. 5శాతం లోపల ఓట్లు వచ్చిన పార్టీలకు దామాషా ప్రాతినిధ్యం ఉండదు. మిగిలిన పార్టీలకు 8, 8, 3, 1 స్థానాలు వరసగా లభిస్తాయి. 22 స్థానాలు ఇప్పటిలాగే నియోజకవర్గం వారీ ఎన్నికల ద్వారా భర్తీ అవుతాయి. దామాషా పద్ధతిలో సీట్లు భర్తీ కావాలంటే, ఆయా పార్టీలు తాము నిలబెట్టే 20 లేదా 21 మంది అభ్యర్థుల జాబితాను ముందుగానే విధిగా ప్రకటించాలి. ఆ అభ్యర్థుల సంఖ్య రిజర్వేషన్ల ద్వారా ఆయా వర్గాలకు కేటాయించిన విధంగా ఉండాలి. దళితులూ, గిరిజనులలో కూడా మహిళల ప్రాతినిధ్యం ఉండి, మొత్తం అన్నివర్గాల మహిళల సంఖ్య కనీసం మూడోవంతు ఉండాలి. ఒక పార్టీ ప్రకటించిన జాబితాలో అభ్యర్థికి ఇచ్చిన వరస క్రమాన్ని బట్టి అభ్యర్థులు ఎంపికవుతారు. ఉదాహరణకు ఆ పార్టీకి రాష్ట్రంలో 8 స్థానాలు దామాషా పద్ధతిన వస్తే, 5 లేక 6 స్థానాలలో మహిళలు (దళితులు, గిరిజనులతో కలిపి), మిగిలిన 2 లేదా 3 స్థానాలలో దళితులూ గిరిజనులలోని పురుషులు జాబితాలో వరస క్రమాన్ని బట్టి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు. ఈ పద్ధతి వల్ల ఓటర్లకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటి మాదిరిగానే నియోజకవర్గాలలో అభ్యర్థులకు ఓటు వేస్తారు. అయితే పార్టీ అభ్యర్థులకు వేసే ఓట్లు ఆ పార్టీ తరపున దామాషా పద్ధతిన ఎన్నిక కోసం ఉపయోగపడతాయి. పార్టీల జాబితాలలో ఏ పార్టీకి ఎందరు, ఏ వర్గాల వారు ఎన్నికవ్వాలో కొంత క్లిష్టమైన అంశమైనప్పటికీ, దానితో ఓటర్లకు సంబంధం లేదు. శిక్షణ పొందిన ఎన్నికల అధికారులు ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలకు, ప్రజలకు అర్థమయ్యేరీతిలో ఆ లెక్కలు వేసి జాబితాలలోని అభ్యర్థుల ఎంపికను ప్రకటిస్తారు. పార్టీలు రాష్ట్రాలలో లేదా జిల్లాలలో ఉన్న నాయకులలో మంచి పేరు, శక్తిసామర్థ్యాలు ఉన్నవారిని తమ తమ పార్టీ జాబితాలలో ఆయా వర్గాల తరపున అభ్యర్థులుగా ప్రకటించవచ్చు కాబట్టి నాయకత్వం సహజంగా, సాఫీగా ఎదుగుతుంది. దామాషా పద్ధతి వల్ల కూడా కొన్ని సమస్యలున్నాయి. మొదటిది– ఓటర్లకు అభ్యర్థుల్ని ఎంపిక చేసే అవకాశం తగ్గుతుంది. విధిగా తమకు నచ్చిన పార్టీ అభ్యర్థికే ఓటు వేయాల్సి ఉంటుంది. లేకపోతే ఇటు నియోజకవర్గంలోను, అటు దామాషా లోను ఆ పార్టీ నష్టపోతుంది. పార్టీ కూడా నియోజకవర్గాల్లో వీలున్నంతమేరకు ఓట్లు పొందటం కోసమని మంచిపేరున్న అభ్యర్థులనే ప్రతిపాదించే అవకాశముంది. లేకపోతే రెండుచోట్లా నష్టపోతామనే భయం పార్టీలను వేధిస్తుంది. దామాషా పద్ధతి వల్ల ఉత్పన్నమయ్యే రెండవ సమస్య మరింత తీవ్రమైంది. ఇప్పటికే దేశంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి. పార్టీ అధినాయకులు తమ ఇష్టాయిష్టాలను బట్టి వారి

అడుగులకు మడుగులు వత్తే వారిని అభ్యర్థులుగా నిలబెడుతున్నారు. పార్టీ సభ్యులు అదేమంటే, కన్యాశుల్కంలో అగ్రిహోత్రావధాన్లు లాగా 'తాంబూలా లిచ్చేశాను, తన్నుకు చావండీ' అని లెక్కలేకుండా మాట్లాడుతున్నారు. ప్రధాన పార్టీలన్నీ అలాగే వాజమ్మలను, గూండాలను, నేరస్తులను, డబ్బు తప్ప మరే అర్హత లేనివాళ్లను, అవినీతిపరుల్ని ఎక్కువమందిని అభ్యర్థులుగా నిలబెడుతున్నాయి. దాంతో ఓటర్లకు 'దొందూ దొందే'గా కనిపించి, 'ఏ రాయైతేనేమి? పళ్లూడగొట్టుకోవటానికి!' అని అనాసక్తంగా ఓటు వేయాల్సి వస్తోంది. లేదా గూండాలకు భయపడో, డబ్బుకు లంగో, క్షణికావేశాలకు లోనయ్యో ఓటు వేస్తున్నారు. అలాంటప్పుడు, జాబితాలు తయారుచేసే అధికారం ఆ పార్టీల నాయకులకిస్తే వారి ధోరణి మరింత నిరంకుశమై పార్టీ సభ్యులు ఇంకా బలహీనమయ్యే ప్రమాదముంది. అలాగే ఓటర్ల పాత్ర మరింత క్షీణించి, ఇంకా నామమాత్ర మవుతుంది. కాబట్టి పార్టీ జాబితాలను ప్రజాస్వామికంగా, నిర్దేశించిన పద్ధతి ద్వారా, పార్టీ లోపల ఓటింగు ద్వారా తయారుచేసేటట్లు చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి. ఈ ఇబ్బందులను అధిగమించాలంటే పార్టీలను ప్రజాస్వామీకరణం చేసి, వాటిని నేతల నియంతృత్వం నుంచి తప్పించి సభ్యుల అధీనంలోకి తేవాలి. ఇది దామాషా పద్ధతిలో కొత్తగా ఉత్పన్నమయిన సమస్య కాదు. పార్టీలు నాయకుల సొంత ఆస్తులుగా చలామణి కావటం ప్రస్తుతం చాలాచోట్ల నడుస్తున్నది! ఈ సమస్యలున్నప్పటికీ, దామాషా పద్ధతిన వివిధ వర్గాలకు సీట్లు కేటాయించటం, ప్రస్తుతం ప్రవేశపెట్టిన నియోజకవర్గాల రిజర్వేషన్ కంటే చాలా ఉత్తమమయినది.

**పార్టీల జాబితాల్లోనే కేటాయింపులు**

వివిధ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించి శాశ్వత ప్రాతిపదికన సహజ నాయకత్వం ఎదగాలంటే పార్టీ అభ్యర్థుల ఎంపికలోనే చట్టబద్ధంగా కొన్ని మార్పులు చేయటం సర్వశ్రేష్ఠమయిన పద్ధతి. ఇందులో పార్లమెంటు సీట్లకు రాష్ట్రం, శాసనసభ సీట్లకు జిల్లా యూనిట్లుగా ఉంటాయి. ఆ యూనిట్లలోని స్థానాలలో మహిళలకు, దళితులకు, గిరిజనులకూ విధిగా తగిన సంఖ్యలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలి. ఉదాహరణకు మన రాష్ట్రంలోని ఒక పార్టీ 42 స్థానాలలో అభ్యర్థుల్ని నిలబెడితే, 14 స్థానాలకు విధిగా మహిళలనే (దళిత, గిరిజన మహిళలతో సహా) ఎంపిక చెయ్యాలి. చట్టాన్ని బట్టి, మరొక 5 నుంచి 6 స్థానాలలో దళిత, గిరిజన పురుష అభ్యర్థుల్ని ఎంపిక చేయాలి. అయితే ఏయే స్థానాలలో మహిళల్ని, ఇతరుల్ని నిలబెట్టాలనేది ఆ పార్టీకే వదిలేయాల్సి ఉంటుంది. అంటే ఆ పార్టీకి ఆ నియోజకవర్గంలో ఉన్న నాయకత్వాన్ని బట్టి, అందుబాటులో ఉన్న అభ్యర్థుల శక్తిసామర్థ్యాలు, గుణగణాలు, పలుకుబడిని బట్టి అభ్యర్థులను నియమించవచ్చు. ఫలానా నియోజక వర్గంలోనే మహిళా అభ్యర్థిని నిలబెట్టాలని నియమం లేదు. మొత్తం మీద మూడోవంతు మంది ఆ రాష్ట్రంలో ఆ పార్టీ తరపున మహిళా అభ్యర్థులు ఉండితీరాలి. పార్లమెంటు ఎన్నికకు రాష్ట్రాన్ని యూనిట్‌గా పరిగణించటం అవసరం. లేకపోతే ఒక పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాలలో మగవాళ్లను, అగ్రకులాల వాళ్లను నిలబెట్టి, ఎలాగూ విజయావకాశాలు లేని రాష్ట్రాలలో సీట్లను మహిళలకు, దళితులకు, గిరిజనులకు కేటాయించే అవకాశం ఉంది. రాష్ట్రాన్ని యూనిట్‌గా నిర్ధారిస్తే, ప్రతి రాష్ట్రంలోను, పోటీకి పెట్టిన ప్రతి పార్టీ విధిగా నిర్దేశించిన సంఖ్యలో మహిళలను, దళితులను, గిరిజనులను అభ్యర్థులుగా నిర్ణయించాల్సి ఉంటుంది. రాష్ట్ర అసెంబ్లీకి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుంటే, ఆ జిల్లాలోని స్థానాలలో విధిగా నిర్దేశించిన శాతం మేరకు ఆ పార్టీ వివిధ వర్గాలవారిని నిలబెట్టాల్సి ఉంటుంది. ఈ పద్ధతి వల్ల ప్రతి పార్టీ ఒకే నియోజకవర్గంలో ఒకే రకం అభ్యర్థుల్ని నిలబెట్టాల్సిన అవసరం లేదు. తమ అభ్యర్థుల గుణగణాల్ని బట్టి ఎవరు ప్రజాభిమానాన్ని పొందే అవకాశం ఉందో వారిని నిలబెట్టవచ్చు. కేటాయించిన వర్గాల వారికి తగిన సంఖ్యలో సీట్లివ్వటం మాత్రం తప్పనిసరి. అలా నిలబడ్డవారు సమర్థులు కాకపోతే పార్టీ నష్టపోతుంది కాబట్టి, ఆ వర్గాలలో నాయకత్వ లక్షణాలున్నవారిని ఎంపిక చేస్తారు. తమ చెప్పుచేతల్లో ఉండేవారిని ఎంపిక చేసే ఇప్పటి అలవాటు తగ్గుముఖం పడుతుంది. దేశమంతటా ఎన్నో నియోజకవర్గాలలో ప్రధాన పార్టీల తరపున బలమైన అభ్యర్థులు మహిళలు, దళితులు, గిరిజనుల నుంచి నిలబడతారు. అప్పుడు ప్రజల అభీష్టం మేరకు ఆయా వర్గాల వారు ఎంత శాతమైనా ఎన్నిక కావచ్చు. ఉదాహరణకు స్త్రీలు తలుచుకుంటే సగం మంది, లేదా ఇంకా ఎక్కువ మహిళా సభ్యులే ఎన్నిక కావచ్చు. ఒకవేళ పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువగా ఎన్నికయినా, కనీసం 20-25శాతం దాకా వెంటనే ఎన్నికవుతారు. అది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లో కాక, తమ శక్తిసామర్థ్యాల వల్ల, ప్రజలను ఆకట్టుకోవటం వల్ల ఎన్నికవుతారు. సహజమైన నాయకత్వం పెరిగి, జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను విశిష్టస్థానాన్ని పొందుతుంది. ప్రస్తుతం

ఒకటి రెండు ఉదాహరణల్ని మినహాయిస్తే రిజర్వుడు స్థానాలలో ఎంపికయినవారికి నిజమైన గుర్తింపు, గౌరవం, ప్రతిష్ట లేవు. వారు పెద్ద నాయకులుగా ఎదగటం దాదాపు అసాధ్యమయిపోయింది. ఈ విధంగా ఏ కోణం నుంచి చూసినా పార్టీలు రాష్ట్రాలలో, జిల్లాలలో విధిగా ఆయా వర్గాల వారిని తగినంతమందిని తమకు అవకాశమున్న నియోజకవర్గాలలో అభ్యర్థులుగా నియమించటం అన్నివిధాలా అవసరం. పార్టీలు తప్పనిసరిగా ఆ విధంగా అభ్యర్థుల్ని ఎంపిక చేసే విధంగా రాజ్యాంగంలో సవరణలు చేయాలి. తగిన చట్టం చేయాలి. దాన్ని పాటించకపోతే ఆ పార్టీకి గుర్తింపు రద్దవుతుంది. పార్టీలకతీతంగా పోటీచేసేవారి ప్రభావం ఎన్నికల మీద చాలా స్వల్పంగా మాత్రమే ఉంటుంది.

**ప్రజాస్వామిక పరిష్కారాలు**

ఏ పద్ధతిని అనుసరించినా, పార్టీలలో నాయకత్వం ఎన్నికల, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రాథమిక ఎన్నికల ద్వారా, సభ్యుల అభీష్టానుసారం జరిగే విధంగా చట్టాలను తయారుచేయాలి. లేకపోతే పార్టీలలో నియంతృత్వం, ఆశ్రిత పక్షపాతం ఇలాగే కొనసాగి, ఎవరు ఎన్నికయినా ప్రజలే నిరంతరం ఓడిపోయి ఆక్రోశించటం ఖాయం. మహిళల ప్రాతినిధ్య సమస్యను ఒక సువర్ణావకాశంగా భావించి, రాజకీయ పార్టీలను చట్టబద్ధంగా ప్రక్షాళన చేసి, అవి ప్రజాస్వామ్యబద్ధంగా నడిచేలా శాసనపరంగా ఏర్పాట్లు చేయటం, ఆ చట్టాన్ని పర్యవేక్షించే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వటం అత్యవసరం. అలాకాక గతంలోలాగే కంటితుడుపు చర్యల్ని చేపట్టి తాత్కాలికంగా కొన్ని వర్గాలను మోసంతో సంతృప్తిపరిచే ప్రయత్నం చేస్తే, పేరుకు ఎందరు మహిళలు ఎన్నికయినా ఫలితం మాత్రం శూన్యం. మన సమస్యలకు హేతుబద్ధమయిన, ప్రజారంజకమయిన, ప్రజాస్వామికమయిన చక్కటి పరిష్కారాలు ఉన్నాయి. వాటిని అమలుచేసే చిత్తశుద్ధి నాయకులకు, వీటిని చర్చించి ప్రజలను సమాయత్తం చేసే విజ్ఞత ఆలోచనా పరులకు ఉన్నాయా అన్నదే కీలకమైన ప్రశ్న.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఆగస్టు 3, 1998న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం ★

## లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీలోకి సీనియర్లు
## 'పౌర సేవల' హక్కు చట్టంపై ప్రజాచైతన్య కార్యక్రమాలు

లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న 'పౌర సేవల' హక్కు బిల్లును చట్టంగా తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు నిర్ణీత గడువుతో హక్కుగా సేవలు పొందటం, గడువు దాటినా సేవలు అందించకపోతే రోజుకు కనీసం రూ. 250 జరిమానాను పొందటం వంటి అంశాలతో ఈ బిల్లు రూపొందిందని, దీనిపై ప్రజల్లో అవగాహనా కార్యక్రమాల్ని చేపడుతున్నామని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు తెలిపారు. లోక్‌సత్తా ఎజెండాకు



తెలంగాణలో తిరుగులేని ఆదరణ ఉందని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్టీలోకి తిరిగి వచ్చిన సీనియర్లను ఆయన సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు. వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమక్షంలో పార్టీ సీనియర్లు పూదూరి శ్రీనివాసరావు (రాష్ట్ర ఉపాధ్యక్షుడు), నందిపేట రవీందర్ (అధికార ప్రతినిధి), తుమ్మనపల్లి శ్రీనివాస్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి - స్ట్రాటజీ)లు బాధ్యతలు స్వీకరించారు. వీరితోపాటు రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న యువ నాయకుడు అల్లేని అఖిల్‌కు రాష్ట్ర కార్యదర్శి బాధ్యతను అప్పగించినట్టు పాండురంగారావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్రీరామ్ దేశ్‌పాండే, సరోజాదేవి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. ★

# 'సృజనాత్మక ఒత్తిడి' పోరాట పంథాకు 100 ఏళ్లు




రాజకీయాలు, పాలనలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయటం ఈవేళ మనదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్లలో ఒకటి. స్వతంత్రం వచ్చిన ఒకట్రెండు దశాబ్దాల నుంచి ఈ సమస్య పెరుగుతూ వచ్చినా.. మారిన ఆర్థిక పరిస్థితులు, పెరిగిన పోటీ తత్వం నేపథ్యంలో ఇప్పుడో జటిలమైన సమస్యగా, సవాలుగా తయారైంది. దేశ జనాభాలో అత్యధికులు యువతే కాబట్టి.. ప్రజల్ని భాగస్వాముల్ని చేయటమంటే ప్రధానంగా యువతీయువకుల్ని భాగస్వాముల్ని చేయటమే.

దేశం కోసం పనిచేయకుండా ఉండే మినహాయింపు ఏ పౌరునికీ ఉండదు. కొందరు ఎక్కువగా, ఇంకొందరు పూర్తిసమయం పనిచేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం.. దేశం కోసం పనిచేయటానికి సమయం, వనరులు లేవని కొంతమంది చెప్పటం, టైం ఇవ్వగలిగినవాళ్లు సొంతపనుల్లా చేయలేమన్నట్టు వ్యవహరించటం, ఒక పరిధి దాటి ఉచితంగా దేశసేవ చేయాలంటే చాలా ఖర్చవుతుందన్నట్టు ఇంకొంతమంది ప్రవర్తించటం జరుగుతోంది.

ఈ సవాలును ఎదుర్కొనే క్రమంలోనే.. సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆందోళనా పద్ధతుల్ని అనుసరించాలనే అంశం కూడా మళ్లీ మళ్లీ చర్చనీయాంశమవుతోంది. బ్రిటిష్ వలస పాలకుల మీద ప్రయోగించిన ఆందోళనాపద్ధతులు స్వతంత్ర భారతదేశానికి పనికిరావని రాజ్యాంగాన్ని ప్రజల ముందుంచుతూ డా॥ అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగం ఎంత ఉదాత్తమయినా, ప్రజల్లో రాజ్యాంగబద్ధ ప్రవర్తన, స్వభావం అలవోకగా సమకూరవని, మనదేశ పరిస్థితుల్లోనైతే వాటిని పనిగట్టుకుని నేర్పించాల్సి ఉంటుందని బాబాసాహెబ్ స్పష్టంచేశారు. కానీ అటువంటి వ్యవస్థల నిర్మాణం కొరవడినందున, జాతీయోద్యమ తరం నిజాయతీ నేతలు కనుమరుగైనందున రాజ్యాంగ ప్రజాస్వామ్యం మన వద్ద ఇప్పటికీ సాకారం కాలేదు. స్పందన కొరవడిన ప్రభుత్వాలను కదిలించాలంటే, ఎంతోకొంత తక్షణ న్యాయం జరగాలంటే బ్రిటిష్ కాలంనాటి ఆందోళనా పద్ధతులే మెరుగనే భావన రాజకీయ వ్యవస్థలో బలంగానే కొనసాగుతూ వచ్చింది. ఆనాడు మహాత్మాగాంధీ వంటి వారు కూడా కొన్ని కీలక సందర్భాల్లో ఇవే ఆందోళనా పద్ధతుల్ని అనుసరించారు కాబట్టి, ప్రజల్లో కూడా కొంత వీటికి ఆమోదం లభిస్తోంది. కానీ రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగిపోవటం, పోటీ ప్రపంచంలో రోజువారీ సంపాదన కీలకమవటంతో అటువంటి ఆందోళనాపద్ధతులు ప్రజలకే కాకుండా, సారథ్యం వహించేవారికి కూడా పెనుభారాలుగా మారుతున్నాయి.



5 Cutting Indigo plant in the field and Loading Carts.

రాజకీయాలను వ్యాపారంగా భావించి, పెట్టుబడికి తగ్గట్టు దండుకుందామనుకునేవారు తప్ప మిగిలినవారు అలాంటి ఆందోళనలకు దూరమవుతున్నారు. రాజకీయాలు, ఎన్నికలు అంటే విధానాలు, విలువలతో కూడిన పోరాటం కాకుండా.. డబ్బు, రోడ్ల మీద రచ్చ, ఆమరణ నిరాహారదీక్షలు చేయటం ద్వారా ప్రచారమే అనే పరిస్థితి రావటంతో, అసలే రాజకీయాలకు సమయం ఇవ్వలేకపోతున్న యువజనం రాజకీయాలకు మరింత దూరమవుతున్నారు. కానీ దేశ ప్రజలను, యువతను రాజకీయాలలో భాగం చేయకుంటే, ఇక ఈ దేశం మనుగడ సాగించవచ్చేమోగానీ ఎదగలేదనటంలో సందేహం లేదు. యువతను రాజకీయాలలో భాగం చేయటానికి తగిన విధానాలను రూపొందించటం ఇప్పుడు అత్యవసరం.

ఇటీవలికాలంలో.. వ్యక్తిగతంగా వేగంగా, తేలిగ్గా స్పందించగలిగే ఆన్‌లైన్/సోషల్ మీడియా సమీకరణ, ఆందోళనాపద్ధతులు అందుబాటులోకి రావటంతో యువత రాజకీయాల పట్ల తిరిగి కొంత ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇది చాలా సానుకూల పరిణామం. కానీ ఇందులోనూ బ్రిటిష్ పాలన నాటి ఆలోచనాతీరుతో జీరోసమ్ వ్యవహారశైలే ఎక్కువగా కనిపిస్తోంది. ఎవరో ఒక శత్రువుని బూచిగా చూపించి తప్ప స్పందించలేకపోతున్నారు. తమకు మేలు జరగాలంటే ఇతరులు నష్టపోవాల్సిందేననే తీవ్ర ధోరణులు కనిపిస్తున్నాయి. బ్రిటిష్ కాలంలో 'ఆందోళనల తీరు' ముతకగా ఉంటే, ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలామంది 'ఆలోచనల తీరు' ముతకగా ఉంటోంది. చురుకైన యువత ఆందోళన స్వరూపం మారటం హర్షణీయమే అయినా, ఆలోచనాస్థాయి పెద్దగా పరిణతి చెందకపోవటం వల్ల ఇదొరకమైన ముతక ఆందోళనలాగే ఉంటూ ఆశించిన ఫలితం రావటం లేదు.

క్షేత్రస్థాయిలో ఆందోళనల్ని, ఆన్‌లైన్ ఆందోళనల్ని పరస్పర ఆధారితాలుగా భావించి మనం దిద్దుబాటు చేసుకోవాల్సుంది. అంటే బైట చేసే ఆందోళనలకు, ఆన్‌లైన్‌లో మనం వ్యక్తం చేసే, మద్దతిచ్చే లేదా మద్దతు కోరే అభిప్రాయాలు/ఎజెండాకు ఒక ప్రామాణిక పంథా ఉండాలి. తాత్కాలికంగా మనకు ప్రయోజనం చేకూర్చటం గురించి ఆలోచిస్తూ సమీప భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీసే చర్యలకు మనం పాల్పడకూడదు. ఆన్‌లైన్ వేదికలతో మొదలుపెట్టి ఈ మార్పును గనక మనం సాధించగలిగితే.. కచ్చితంగా మనం యువత భాగస్వామ్యాన్ని రాజకీయాలలో, పాలనలో పెద్దఎత్తున పెంచే అవకాశాలుంటాయి. ఇక్కడ మనకు మార్గం చూపుతున్నారు మహాత్మాగాంధీ.

గాంధీజీ పోరాటపద్ధతులైన హర్తాళ్, బంద్, ఆమరణ నిరాహారదీక్ష వంటివి రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ఆచరణకు తగినవి కావనటంలో సందేహం లేదు. 'నా డిమాండ్‌ను నెరవేర్చకపోతే ఛస్తాను' వంటి ఆందోళనాపద్ధతుల్ని స్వతంత్ర భారతదేశంలో కూడా అనుమతిస్తే, **130**కోట్ల మంది బెదిరింపుల మధ్య పరిపాలనే సాగదు. స్వాతంత్ర్యానికి అర్థమే ఉండదు. ఈ పోరాట పద్ధతుల విషయంలో మనం గాంధీ మార్గాన్ని అనుసరించటం సరికాకపోవచ్చు. కానీ ఆ పోరాటపద్ధతులను గాంధీ ఉపయోగించిన లక్ష్యం మనకు నిరంతరం స్ఫూర్తిదాయకం.

గాంధీ తన పోరాటాల్ని పాలకులపై, సమాజంపై, పార్టీపై, ప్రత్యర్థులపై సృజనాత్మక ఒత్తిడిని తెచ్చేందుకే చేశారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కొన్నిసార్లు బెదిరింపు పద్ధతుల్ని అనుసరించినా, చాలా సందర్భాలలో ఆయన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలోలాగానే వ్యవహరించారు. అహింసా స్ఫూర్తిని చాటారు. ఆందోళనా పద్ధతుల విషయంలో విభేదించినా..



***గాంధీజీ అనుసరించిన 'సృజనాత్మక ఒత్తిడి' (క్రియేటివ్ టెన్షన్) పోరాటపంథాను మనం ఆన్‌లైన్‌లో, బైట కూడా అనుసరించటం ఇపుడు మనకున్న అత్యుత్తమ నాగరిక ప్రజాస్వామ్య పరిష్కారం. ఈ పోరాటపంథాను గతంలో అనేకమంది పెద్దలు వ్యక్తిగతంగా, మతపరంగా, రాచరిక యుగంలో కొన్ని సందర్భాలలో వినియోగించి ఉండవచ్చు. కానీ ఎంతో భిన్నత్వం, సంక్లిష్టతలు ఉన్న ఒక పేద, అతి పెద్ద దేశంలో గాంధీ ఈ పోరాటపంథాను వ్యవస్థీకృతంగా వినియోగించారు. మానవాళికి మహోపకారం చేశారు.***

***గాంధీ సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథాకు 100ఏళ్లయిన సందర్భం.. మనకు ఉన్నకొద్దీ సమస్యగా మారుతున్న ఈ అంశం మీద మరింతగా దృష్టిసారించటానికి స్ఫూర్తినిస్తోంది.***

అవును! ఆధునిక భారతదేశంలో సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథా మొదలై 100 ఏళ్లు.

వందేళ్ల ఓ దుష్టచట్టాన్ని.. సరిగ్గా వందేళ్ల క్రితం ఇదే సృజనాత్మక ఒత్తిడి పంథాలో పోరాడటం ద్వారా గాంధీ నిర్మూలించారు.

దక్షిణాఫ్రికాలో అహింసాపోరాటం చేసి గణనీయ ప్రభావం చూపిన అనంతరం గాంధీజీ భారత్‌కు తిరిగి వచ్చారు. ఆ తర్వాత బ్రిటిష్ పెత్తనానికి వ్యతిరేకంగా 1917లో తొలి ఆందోళనను ప్రారంభించారు. బీహార్‌లోని చంపారన్ అందుకు వేదిక. సృజనాత్మక ఒత్తిడితో బ్రిటిష్‌ను కదిలించి రైతులు, కూలీల సమస్యలను గాంధీజీ విజయవంతంగా పరిష్కరించగలిగారు. ఈ ఏప్రిల్‌లోనే ఈ గొప్ప విజయం శతవార్షికోత్సవం.

ఆన్‌లైన్ సమాచార యుగంలో ఉండటంతో మనకు గంటకో వార్త, రోజుకో సంచలనం లేకపోతే తోచినట్టుండదు. కానీ తనకంటే ముందు 60 ఏళ్ల జాతీయోద్యమ పోరాట పునాది, సమకాలీనంగా భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ వంటి వారి భిన్న పోరాటాలు ఉన్నా.. గాంధీజీ తన 32ఏళ్ల స్వతంత్రోద్యమ కాలంలో చేసిన పెద్ద ఆందోళనలు నాలుగైదుకి మించి ఉండవు. ప్రతి ఉద్యమానికీ మధ్య ఏళ్ల తరబడి విరామం ఉంటుంది. ఈ ఉద్యమాల్లో అడపాదడపా ముతక ఆందోళనాపద్ధతుల్ని అనుసరించినా, వాటినీ సృజనాత్మక ఒత్తిడికే ఆయన వినియోగించారు తప్ప విద్వేషాల్ని రెచ్చగొట్టేందుకు, తాత్కాలిక అవసరాల కోసము కాదు.

భిన్నత్వంలో సామరస్యతను పెంచటం, సృజనాత్మక ఒత్తిడితో ఎదుటివారి నుంచి అనుకున్నది సాధించటం.. ఈ లక్షణాల వల్లే గాంధీ ఈ దేశ చరిత్రలో ఎవరూ చెరిపివేయలేనంత గొప్ప వ్యక్తిగా మిగిలిపోయారు. ప్రపంచంలో పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. గాంధీ.. తర్వాతికాలంలో అనుసరించిన ముతక ఆందోళనా పద్ధతులు సైతం తొలి చంపారన్ సత్యాగ్రహ పోరాటంలో పెద్దగా కనిపించవని పరిశోధకుల అభిప్రాయం. చట్టబద్ధమైన, నైతికమైన పద్ధతిలో పాలకులపై, భూస్వాములపై ఒత్తిడి తెస్తూ గాంధీజీ అత్యంత నాగరిక ప్రజాస్వామ్య పద్ధతుల్లో చంపారన్ ఉద్యమాన్ని నడిపించారు.

## ఉప్పొంగించే చంపారన్ ఉద్యమం




దక్షిణాఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చిన గాంధీజీ గుజరాత్‌లో సబర్మతీ ఆశ్రమాన్ని స్థాపించారు. రాజకీయ గురువుగా భావించిన గోపాల కృష్ణ గోఖలే సలహా మేరకు భారతదేశాన్ని అర్థం చేసుకోవటానికి పర్యటన ప్రారంభించారు. బెంగాల్‌లోని శాంతినికేతన్ నుంచి బోంబే, పూణే, రంగూన్, రిషికేశ్.. ఇలా ప్రయాణించారు. తర్వాత బాలగంగాధర్ తిలక్‌కు, రాజీవాదులకు భిన్నంగా మధ్యేమార్గాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తూ అనీబిసెంట్ వంటి వారి సహకారంతో మద్రాస్, మరికొన్ని దక్షిణాది ప్రాంతాల్నీ సందర్శించారు.

లక్నోలో కాంగ్రెస్ 31వ వార్షికోత్సవ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, రాజ్‌కుమార్ శుక్లా అనే నీలిమందు రైతు గాంధీజీని కలుసుకుని చంపారన్ వచ్చి రైతుల కష్టాల్ని వినాలని కోరారు. అది డిసెంబర్ 1916.

హిమాలయ పర్వత సానువులలో నేపాల్‌కి దగ్గరగా ఉండే ప్రాంతం చంపారన్. ఈ గ్రామప్రాంతంలో ఇప్పుడు చెరకు పండిస్తున్నారుగానీ, అప్పట్లో ఆహారధాన్యాల పంటల్నే పండించేవారు. కానీ బ్రిటిష్ భూస్వాములు/ప్లాంటర్లు, కొందరు స్వదేశీ దొరలు, కాంట్రాక్టర్లు రైతుల చేత బలవంతంగా నీలిమందు పంటను వేయించేవాళ్లు. 'తీన్‌కథియా' అనే చట్టబద్ధమైన ఆదేశం పేరుతో ఈ దౌర్జన్యానికి దిగేవారు. దీనివల్ల ప్రతి రైతూ తన పొలంలోని కొంతభాగంలో నీలిమందు పంట వేయాల్సి వచ్చేది.

తీన్‌కథియా అనే పదాన్ని ఇప్పటికీ ఈ ప్రాంతవాసులు మరచిపోలేదు. తాము పండించుకునే ఆహారధాన్యాలు, ఇతరత్రా పంటల స్థానంలో నీలిమందు మొక్కల్ని పెంచటం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. ధిక్కరిస్తే భారీ సుంకాలను కట్టాల్సి వచ్చేది. నీలిమందు మొక్కల నుంచి తయారుచేసిన అద్దకాన్ని (డ్రై) బ్రిటన్‌లోని వస్త్రమిల్లులకు సరఫరా చేసేవారు. గుమాస్తాల ద్వారా ఈ దోపిడీని దొరలు అమలుచేస్తుండేవారు.

శుక్లా సమస్యను చెప్పినప్పుడు.. తనకు చంపారన్ పేరు కూడా తెలియదని, నీలిమందు గురించి కూడా అవగాహన లేదని గాంధీ తన స్వీయచరిత్రలో రాసుకున్నారు.

దాదాపు నాలుగు నెలల తర్వాత 1917 ఏప్రిల్‌లో గాంధీజీ చంపారన్‌కు బయల్దేరి వెళ్లారు.

కలకత్తా నుంచి వచ్చిన గాంధీ పాట్నా రైల్వే స్టేషన్‌లో దిగారు. ఆయన ఆ నగరానికి రావటం అదే మొదటిసారి. బాబూ రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో బస చేశారు. స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి అప్పుడు ఏదో పని మీద నగరం వెలుపల ఉన్నారు. అంటరానితనాన్ని పాటించే ఆ ప్రాంతంలో గాంధీకీ ఆ సెగ తగిలింది. గాంధీ కులమేమిటో తెలియకపోవటం వల్ల రాజేంద్రప్రసాద్ నౌకర్లు ఇంట్లో టాయిలెట్‌ని ఉపయోగించుకునేందుకు గాంధీకి అనుమతివ్వలేదు. చిన్న స్టోర్‌రూం లాంటి దాంట్లో ఉంటూ.. కాలకృత్యాలకు ఇంటి బైటికి వెళ్లాల్సి వచ్చేది.

''అయితే అందులో నేను ఇబ్బందివడాల్సింది, బాధపడాల్సింది ఏమీ లేదు. అటువంటి అనుభవాలు నన్ను రాటుతేలేలా చేశాయి. నౌకరు తన విధిని నిర్వహిస్తున్నాడంతే'' అని స్వీయచరిత్ర 'మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' (సత్యాన్వేషణ)లో గాంధీ రాసుకున్నారు.

అక్కడ్నుంచి చంపారన్ ప్రాంతంలోని మోతిహరి ప్రాంతానికి గాంధీ చేరుకున్నారు. గోరఖ్ ప్రసాద్ అనే న్యాయవాది ఇంట్లో బస చేశారు.

ఆలస్యం లేకుండా మరుసటిరోజు నుంచే.. ప్రజలను కలుసుకోవటం, మాట్లాడటం, వారితే మమేకమవటం ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్యం గురించిన డిమాండ్లు, కాంగ్రెస్ జోక్యం వద్దని గాంధీ స్పష్టంగా చెప్పారు. కేవలం చట్టం, నైతికత, చర్చలు, శాంతియుత ఆందోళనా పద్ధతుల్లో చంపారన్ పోరాటాన్ని నడిపారు. బాబూ రాజేంద్ర ప్రసాద్, బ్రిజ్ కిషోర్, కృపలానీ, ముఝూరుల్ హక్ వంటి అనేకమంది యువ నాయకులు గాంధీకి తోడయ్యారు. వీరు గ్రామాలు

తిరుగుతూ ప్రతి దౌర్జన్యాన్నీ, సమస్యనూ క్షుణ్ణంగా నమోదు చేశారు.

భవిష్యత్తులో జన రాజకీయ ప్రభంజనం సృష్టించటానికి కావలసిన అనుభవానికి నాంది గాంధీకి ఇక్కడే పడింది.

నీలిమందు పెంపకం వల్ల.. చంపారన్‌లోని పురుషులు, మహిళలు, పిల్లలు అని తేడా లేకుండా అందరూ వెట్టిచాకిరీ చేసే కూలీలుగా మారారు. రోజంతా కష్టం చేస్తే పెద్దలకు పది పైసలు, పిల్లలకు మూడు పైసలు ఇచ్చారు. గాంధీతో తమ గోడు వెళ్లబోసుకోవటానికి వారంతా తరలివచ్చారు. ప్రతి రోజూ సమావేశాలు నిర్వహిస్తూ గాంధీ వారందరితో మాట్లాడారు. భారతదేశం గురించిన అవగాహన ఆయనలో మరింత విస్తృతమవసాగింది.

**బాధితులకు సాయం అందించేంతవరకూ వెళ్లను**

అదేసమయంలో గాంధీకి జిల్లా శాంతిభద్రతల అధికారి ఓ హుకుం జారీ చేశారు. 'మిస్టర్ గాంధీ! మీరు ఈ జిల్లా వదిలి వెళ్లిపోవాలి' అని ఆదేశించారు.

గాంధీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. దీంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు.

'మీరు జిల్లా వదిలి వెళ్తే మీ మీద కేసును వెనక్కి తీసుకుంటారు' అని మేజిస్ట్రేట్ ఒక ప్రతిపాదన గాంధీ ముందుంచారు.

'అది సాధ్యం కాదు' అని గాంధీ సమాధానమిచ్చారు. 'ఈ ప్రాంత ప్రజలకు మానవీయ సేవలందించేందుకు వచ్చాను. చంపారన్‌ని నా నివాసంగా చేసుకుంటాను. ఇక్కడి బాధితులకు పూర్తిసాయం అందించేంత వరకు నేను వెళ్లను' అని స్పష్టం చేస్తూ చరిత్రాత్మక ప్రకటన చేశారు.

గాంధీకి పెరుగుతున్న మద్దతును చూసి, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముండటంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను విడుదల చేసింది.

ఆ తర్వాత రైతుల నుంచి తాను విన్న ప్రతి విషయాన్నీ డాక్యుమెంట్ రూపంలో గాంధీ, ఆయన యువ న్యాయవాద అనుచరులు నమోదు చేశారు. వాటిని బ్రిటిష్ ప్రభుత్వానికి వరసగా నివేదికల్లా పంపసాగారు. చట్టప్రకారం, నైతికతతోనే గాంధీ అంతా చేస్తుండటంతో పాలనావ్యవస్థకు ఏం చేయాలో తోచలేదు.



**ఎట్టకేలకు కమిషన్ ఏర్పాటు**

చివరికి గాంధీ ప్రయత్నాలు ఫలించాయి. ప్రభుత్వం ఒక కమిషన్‌ని నియమించింది. ఇందులోని ఏడుగురు సభ్యులలో గాంధీకి కూడా స్థానం కల్పించారు.

అలాగే, దాదాపు వందేళ్లుగా కొనసాగుతున్న తీన్‌కథియాను నిర్మూలిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చింది.

కమిషన్ నివేదిక ఆధారంగా తయారుచేసిన చంపారన్ వ్యవసాయ బిల్లును బీహార్ శాసనమండలిలో నవంబర్ 29న ప్రవేశపెట్టగా, మార్చి 4, 1919న గవర్నర్ జనరల్ సంతకం చేయటంతో అది చట్టంగా మారింది.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగ తిరుగుబాటును, దాడులు వంటి ఆందోళనాపద్ధతుల్ని ప్రోత్సహించకుండా, బలమైన ప్రత్యర్థిని రాజకీయంగా ఒప్పిస్తూ గాంధీ చంపారన్ రైతుల జీవితాల్లో ఒక పెద్ద సమస్యను పరిష్కరించారు.

బ్రిటిష్‌కి వ్యతిరేకంగా గాంధీ తొలి రాజకీయ పోరాటం ఇది. ఇదే క్రమంలో అహింసాయుత మార్గంలో, సామాన్య ప్రజల మద్దతుతో బ్రిటిష్‌ని సృజనాత్మక ఒత్తిడిలోకి నెడుతూ ఆయన దేశ స్వతంత్ర పోరాటాన్ని నడిపించారు.

**రైతుల సమస్యలపై**
**ఇతర వర్గాల మద్దతు కూడగట్టిన తొలి ఉద్యమం**

1917లో జరిగిన చంపారన్ సత్యాగ్రహానికి ముందు, తర్వాత కూడా రైతుల ఆందోళనలు జరిగాయి. కానీ తొలిసారిగా రైతుల సమస్యలపై ఇతర వర్గాల, ముఖ్యంగా మధ్యతరగతి మేధావుల మద్దతును కూడగట్టి చట్టబద్ధంగా పోరాడటం మాత్రం గాంధీతో చంపారన్ నుంచే ప్రారంభమైంది.

ఇదే ప్రాంతంలో గాంధీ పాఠశాలల్ని కూడా స్థాపించారు. చంపారన్ ప్రాంతంలోని ప్రజల పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్య పరిస్థితులు గాంధీ చేత ఈ పని చేయించాయి. భితిహర్వాలోని స్కూలు క్రమంగా ఆశ్రమంగా మారింది. అక్కడ పాఠాలు చెప్పటానికి ఎవరూ దొరక్కపోవటంతో వలంటీర్ల కోసం గాంధీ పిలుపునిచ్చారు. గాంధీ పిలుపునకు స్పందించి బొంబే, దక్షిణ భారతదేశం నుంచి కూడా ఉపాధ్యాయులుగా పనిచేయటానికి పలువురు ముందుకొచ్చారు. ఒక మారుమూల గ్రామంలో పాఠశాలను ఏర్పాటుచేయటమేకాకుండా తన భార్యను కూడా అందులో రెసిడెన్షియల్ టీచర్‌గా పనిచేయమని కోరిన అరుదైన నాయకుడాయన. ఆమె అక్కడ పాఠాలు చెప్పటమేకాకుండా, గుడిసెలకు వెళ్లి మహిళలకు పరిశుభ్రత గురించి అవగాహన కలిగించేవారు.

ఈ ప్రాంతాన్ని ఓ పవిత్రభూమిగా అక్కడ చాలామంది భావిస్తారు. స్కూలును ప్రారంభించినప్పుడు ఉపయోగించిన బడిగంట, కస్తూరిబా గాంధీ వడికిన రాట్నం, గాంధీకి సంబంధించిన చిత్రాల్ని ఇప్పుడక్కడ మ్యూజియంలా ఏర్పాటు చేశారు.

### ఇప్పుడు పోరాడాల్సింది మనం

చంపారన్‌లో, గాంధీ బ్రిటిష్ వారి మీద విజయం సాధించారు, రైతులకు సంబంధించిన ఒక ప్రధాన సమస్యను పరిష్కరించారుగానీ.. ఆనాడు ఆయన ఏ దోపిడీ, పేదరికం, అవిద్య, అనారోగ్యం, అంటరానితనం మీద పోరాడారో అవన్నీ ఇప్పుడు కూడా మరోరూపంలో చంపారన్ ప్రాంతంలో తాండవిస్తున్నాయి. గాంధీ లక్ష్యాల్ని నెరవేర్చే రాజకీయ, పాలనా వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోకపోవటం వల్ల ఆయన వందేళ్ల క్రితం సాధించిన అపురూప సింబాలిక్ విజయం కూడా మొక్కుబడిగా మారింది. దేశవ్యాప్తంగానూ అనేకచోట్ల ఇవే పరిస్థితులు మౌలికస్థాయిలో తాండవిస్తున్నాయి. దేశంలో అందరికీ స్వేచ్ఛ ఉన్నట్టు కనిపిస్తుందిగానీ.. జనాభాలో అత్యధికులకు ఇంకా స్వేచ్ఛగా ఎదిగే అవకాశాలు రావటం లేదు. ఈ పరిస్థితి వల్ల.. లక్ష్యాల సాధనకు గాంధీ చూపిన సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథా కూడా స్వతంత్ర భారతదేశంలో వేళ్లూనుకోలేదు.

గాంధీజీ పోరాడిన లక్ష్యం కేవలం దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటం మాత్రమే. దేశ ప్రజలందరూ మద్దతిచ్చిన అంశమిది. కానీ స్వతంత్ర భారతదేశం ముందున్న సవాళ్లను పరిష్కరించటం అంత తేలిక కాదు. జాతీయోద్యమం కంటే ఇవి మరింత సంక్లిష్టమైనవి, విస్తృతమైనవి. ఇప్పుడున్న సవాళ్లతో పోలిస్తే, గాంధీజీ పోరాడిన అంశాన్ని చిన్నదిగానే భావించవచ్చు. అందుకే, గాంధీ పోరాటపంథాలో స్వతంత్ర భారత నిర్మాణం చేయటం మరింత అవగాహనతో, ప్రణాళికాబద్ధంగా, ముందుచూపుతో చేయాల్సిన పోరాటం.

### సృజనాత్మక ఒత్తిడి సాధనంగా రాజకీయాలు, పాలన, సమాజ వ్యవహారాలలో పాల్గొనాలి

1917లో చంపారన్‌లో, 1918లో గుజరాత్ ఖేడాలో గాంధీ సాధించిన విజయానికి సార్థకత చేకూర్చేందుకు, ఆయన ఆశించినట్టు వివక్ష, దోపిడీ లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న సమాజాన్ని సాధించేందుకు మహాత్ముడు చూపిన సృజనాత్మక ఒత్తిడి పంథాలో మనమంతా పోరాడాలి.

ఇందుకోసం.. ఆన్‌లైన్ అభిప్రాయ సమీకరణల్లో, ఆందోళనల్లో వాస్తవాలు, హేతుబద్ధత ఆధారంగా విధానాలు, బహిరంగ చర్చ ప్రమాణాలు, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటం, భిన్నంగా ఆలోచించటం, కొత్త పరిష్కారాలు చెప్పటం వంటి ప్రాతిపదికల్ని పాటించాలి. క్షేత్రస్థాయిలో చేసే ఆందోళనల్లోనూ ఇవే ప్రమాణాలను పాటించటంతోపాటు రాజ్యాంగబద్ధ నిరసన పద్ధతుల్నే అవలంబించాలి.

మన పాత్ర మరింత క్రియాశీలం కావటానికి, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్నీ సాధించుకోవాలి.

వ్యక్తిగత జీవితాల్లోనూ మనల్ని గెలిపించే గొప్ప వ్యక్తిత్వ వికాస సూత్రం గాంధీ పోరాట పంథా.

వ్యక్తిగతంగా, వ్యవస్థీకృతంగా విజయాలు సాధించేందుకు.. ఈ సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథాతో రాజకీయాలలో, పాలనలో, సామాజిక జీవనంలో మనమంతా, ముఖ్యంగా యువత భాగస్వాములు కావాలి. ★

# 'భారత ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు - పోరాటపద్ధతుల'పై జేపీ నవ పరిష్కారాలు




డా॥ అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో గాంధీజీ ప్రతిపాదించిన సృజనాత్మక ఒత్తిడి పోరాటపంథాను ఆచరణలో చూపిన లోక్‌సత్తా ఉద్యమానికి, పార్టీకి వ్యవస్థాపకునిగా డా॥ జయప్రకాష్ నారాయణ్ 'భారత ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు - పోరాట పద్ధతులు' గురించి చర్చిస్తూ నవ పరిష్కారాలను ప్రతిపాదించారు.

(వీటికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) ప్రతిష్ఠాత్మక టి.ఎన్ చతుర్వేది పురస్కారం (2016) లభించిన సంగతి తెలిసిందే. ఈ పరిష్కారాలతో ఇండియన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రచురితమైన జేపీ వ్యాసాన్ని అవార్డుకు కమిటీ ఎంపిక చేసింది)

ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు సకాలంలో స్పందించలేకపోవటం, ఎన్ని రకాలుగా ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు స్పందించటంలేదంటూ జనజీవితాలకు ఆటంకం కలిగించే పోరాటపద్ధతుల్ని కొనసాగించటం నేపథ్యంలో.. విధానాల్లో మార్పు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవటానికి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు అనుసరించాల్సిన పద్ధతులపై జేపీ ఈ వ్యాసాన్ని రాశారు.

కొందరు వ్యక్తులు, కార్పొరేట్‌లకు ప్రభుత్వం నుంచి ఆర్థిక లాభాలను సాధించటానికి పని చేసే సంస్థలు, ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయాలనుకునే సంస్థలు.. రెండూ ఒత్తిడి బృందాలే అయినా వేర్వేరుగా చూడాలని వ్యాసంలో జేపీ స్పష్టంచేశారు. విస్తృత ప్రజాప్రయోజనాల రీత్యా ప్రభుత్వ విధానాల్లో మార్పు కోసం పనిచేసే రాజకీయ ఉద్యమాలు, పోరాట పద్ధతులపై ఎక్కువగా చర్చించి పరిష్కారాలను ప్రతిపాదించారు.

స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడచినా మనదేశంలో ప్రభుత్వాల పాత్ర, పౌర ఉద్యమాలు– ఆందోళనాపద్ధతులపై ఉన్న గందరగోళాన్ని తొలుత జేపీ ప్రస్తావిస్తూ.. ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా ఎన్నికల మధ్య తమ ఇష్టాలు, అభిప్రాయాలకనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ, ఇందుకోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వాన్ని చట్టబద్ధ బాధ్యతను హరించే విధంగా, ప్రజాస్వామ్యం పనిచేయలేనిరీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదన్నారు. ప్రభుత్వం ఎన్నికైన మరుసటిరోజు నుంచి మనకు నచ్చినట్టు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలనే దెబ్బతీస్తుందన్నారు. ఎంతో శక్తిమంతమైన వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటం కోసం గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళన పద్ధతుల్ని రూపొందించారని, ఆయన అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయని, అయితే స్వతంత్ర భారతంలో కూడా అవే ఆందోళనాపద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదని జేపీ అన్నారు.

జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి – మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా గుర్తించలేకపోతున్నాయని జేపీ అన్నారు. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅదుపూలేని చట్టధిక్కారాలు వల్ల తలెత్తే ప్రమాదాల గురించి అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారన్నారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుసంపన్నతకు అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే ఎప్పటికీ ఫలితాలు రావన్నారు.

**స్పందన కొరవడిన పాలకులు, రాజ్యాంగేతర పద్ధతులనైనా అనుసరించాలన్న భావన పెంచుకుంటున్న పౌర సంస్థలు కూడా సంస్కరించుకోవాలంటూ ఈ నవ సూచనల్ని జేపీ చేశారు..**

1) పౌర సంస్థ వ్యక్తుల, కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాల లాబీయింగ్ కోసం పనిచేస్తుంటే దేశ ప్రయోజనాల దృష్ట్యా రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ, పారదర్శకత విషయంలో నిబంధనల్ని కచ్చితంగా పాటించటం, నియంత్రించటం అవసరం.

2) వివాదాస్పద అంశాలు, ప్రజల మధ్య చీలిక తెచ్చే అంశాల మీద పనిచేసే పార్టీలు, పౌర సంస్థలు ఎన్నికైన ప్రభుత్వానికి విధానాల్ని నిర్దేశించటంలో తమ పరిమితిని గుర్తించాలి. విధానాలపై రాజకీయ విభేదాలుంటాయి. సాధ్యమైనంతవరకు అవి ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పుతోనే తేలాలి. ప్రజల తక్షణ అవసరాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రభుత్వాలకుంటుంది. కొద్దిమంది తరపున వివాదాస్పద అంశాల కోసం నియంత్రణలేని ఒత్తిడి చేసే సంస్థల వల్ల ప్రజాప్రయోజనాలు దెబ్బతింటాయి, పరిపాలన అసాధ్యమవుతుంది.

3) ప్రభుత్వ మౌలిక బాధ్యతల విషయంలో రాజకీయ పార్టీలు, మీడియా, పౌరసమాజం మధ్య స్థూల ఏకాభిప్రాయం ఉండాలి. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, న్యాయం, చట్టబద్ధ పాలన, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుధ్యం, డ్రైనేజీ సహా మౌలిక వసతులు అందించటం ఆధునిక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన కనీస పనులని అందరూ గుర్తించాలి.

4) ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వానికి, దేశ వ్యవస్థలకు తాము ప్రత్యామ్నాయం కాదని పార్టీలు, పౌర సంస్థలు గుర్తించాలి. రాజకీయ ప్రక్రియ పట్ల గౌరవం, నిరంతరం, నిర్మాణాత్మకంగా హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాలతో మార్పు కోసం పనిచేయటం ఈ ఒత్తిడి బృందాల లక్షణాలుగా ఉండాలి.

5) రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో కొన్ని ఆమోదయోగ్య విధానాలతో పార్టీలు, పౌరులు, పౌరసంస్థల కార్యాచరణ ఉండాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంస్థలుగా ఏర్పడే హక్కు, ఓటు.. ఇవి ఉన్నాక జనజీవితాల్ని ఆటంకపరిచే ఆందోళనాపద్ధతులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. ఈ రాజ్యాంగ పద్ధతుల ద్వారానే పెట్రోలు బంకుల్లో అక్రమాల్ని అరికట్టటం, ఓటరు రిజిస్ట్రేషన్‌లో అవకతవకల్ని సరిచేయటం, నేరచరిత్రుల వివరాలు బైటపెట్టటం, ఆర్‌టీఐ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, స్థానిక న్యాయస్థానాలు, ఎన్‌జేఏసీ వంటి దాదాపు 16 కీలక చట్టాల్ని, రాజ్యాంగ సవరణల్ని అందరినీ సమన్వయం చేసుకుంటూ లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సాధించాయి.

6) ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా సర్వాధికారి కాదు. ఎవరైనా జవాబుదారీయే. ప్రజలు స్వేచ్ఛగా వేసిన ఓటుతో తాము ఎన్నికయ్యామన్న స్పృహ పాలకులకు ఎప్పుడూ ఉండాలి.

7) చట్టసభలు ప్రజాస్వామిక చర్చ, పరిష్కారాలకు సరైన వేదికలని పార్టీలు, ప్రతిపక్ష నేతలు, సభ్యులు గుర్తించాలి. చర్చను, స్వేచ్ఛగా అభిప్రాయ వ్యక్తీకరణను భగ్నం చేయటానికి పార్టీలు విప్ జారీచేయటం నాగరిక ప్రజాస్వామ్యం అనిపించుకోదు. చట్టసభల వైఫల్యం ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తుంది.

8) రాజకీయ వ్యవస్థల్లో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు పార్టీల్ని, ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి. సమర్థత, సేవాభావం, నిజాయతీ కలిగిన సామాన్యులు సైతం వేగంగా నైతిక పద్ధతుల్లో, ప్రత్యామ్నాయ విధానాలు చూపుతూ ఎదగగలిగేలా, ఎన్నికల్లో గెలవగలిగేలా సంస్కరణలు ఉండాలి. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి.

9) మీడియా బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచాలి. విద్వేషం, ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా, ఒకరికి లాభం ఇంకొకరికి నష్టమనేలా చర్చ చేయటం హేతుబద్ధ నిర్ణయాలను, తద్వారా ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తుందని గుర్తించి వ్యవహరించాలి. ★

# భావజాల అన్వేషణలో 'ఆప్'

- శేఖర్ గుప్తా

ఎనిమిదేళ్ల క్రితం అన్నా హజారే ఉద్యమం రాజకీయవేత్తల/ రాజకీయాల వ్యతిరేక సమర నాదంతో మొదలైంది. భారత సమాజంలోని, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలోని చెడులన్నిటికీ రాజకీయాలను, రాజకీయవేత్తలను అది తప్పుపట్టింది. "నేత" అనే మాటే తిట్టయి పోయింది. అయితే ఈ విషయాన్ని ఇప్పుడు గుర్తుచేయాలని ఆయన కోరుకోరనుకోండి. త్వరలోనే ఆ అవినీతి వ్యతిరేక ఉద్యమం, మధ్యస్థ స్థాయికి చెందినవారు, పట్టణ వృత్తి జీవులు "కుళ్లు" రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా చేసే ఒక విధమైన తిరుగుబాటుగా పరిణమించింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రముఖులు, దాని సానుభూతిపరులు, నిలకడగల వామ పక్షవాదులను ఆ ఉద్యమం ఆకట్టు కుంది. బాబా రాందేవ్ నుంచి జనరల్ వీకే సింగ్ వరకు, కిరణ్ బేడీ నుంచి ప్రశాంత్ భూషణ్, షబానా అజ్మీ, ఓంపురి, అమీర్‌ఖాన్‌ల వరకు మద్దతుగా ముందుకు వచ్చారు. భావజాలాలకు అతీతంగా ఆ ఉద్యమం అందరినీ ఆకట్టుకుందనే దానికి ఇది మంచి ఉదాహరణ. కేజ్రీవాల్ నేతృత్వంలో అన్నా హజారే, ఆయన వీరయోధులు ఆ ఆగ్రహావేశపు తరంగంపైనే ఎగిసివచ్చారు. ఎన్నికల తతంగం అంతా అవినీతిపరుల కోసమేనని, ప్రజలు ఓ సీసా మందు కోసమో లేదా రూ.500 నోటు కోసమో ఓటు వేసేవారని, పార్లమెంటు అత్యాచారాలు చేసేవారు, బందిపోట్లు, దొంగలకు నిలయం మాత్రమేనని తీసిపారేశారు. అలాంటి పార్లమెంటులోని ఈ 800మంది (ఉభయ సభల మొత్తం సభ్యులు) 125 కోట్లమంది తలరాత ఎలా రాస్తారు? అని నిలదీశారు. అధికారం ఆవిర్భవించాల్సి ఉంది, పరిపాలన, చట్టాల రూపకల్పన అట్టడుగు నుంచి పైకి సాగాలి. వ్యవస్థను తలకిందులు చేయాలి. ఒక్క



ముక్కలో చెప్పాలంటే ఇప్పుడు కావాల్సింది విప్లవమే తప్ప, అంతకు తక్కువ కాదు.

**ఎన్నికల బాటలో 'విప్లవం'**

అన్నా హజారే, గాంధీలా నటిస్తుండగా, యువ కార్యకర్తలు నానా రకాల సోషలిస్టులు, అందరి కంటే ముఖ్యంగా టీవీ యాంకర్లు ఆయనకు నీరాజనాలు పట్టారు. ఆయన తన ప్రధాన ఆయుధమైన ఆమరణ నిరాహార దీక్ష కూడా గాంధీ నుంచి అరువు తెచ్చుకున్నదే. కాకపోతే ఆయన ప్రయోగించిన సంకేతాలు, అభిభాషణలు మాత్రం గాంధేయమైనవి కావు. భగత్‌సింగ్, సుభాష్ చంద్ర బోస్‌లకు, చివరకు మహారాణా ప్రతాప్‌కు అవి దగ్గరగా ఉండేవి. రాంలీలా మైదాన్‌లో అన్నా చేతులు జాపి "దిల్ దియా హై జాన్ భీ దేంగే, ఏ వతన్ తేరే లియే" అనే దిలీప్ కుమార్ పాట చరణాన్ని వినిపించడాన్ని గానీ, లేదా అరెస్టయి, పోలీసు బస్సులో పోతూ కిరణ్ బేడీ టీవీ కెమెరాలవైపు తిరిగి "అబ్ తుమ్హారే హవాలే వతన్ సాథియో" అని ఆలపించడాన్నిగానీ గుర్తుతెచ్చుకోండి. అయితే ఆమె ఉపయోగించినది ఎన్నటికీ మరపురాని హఖీకత్ చిత్రంలో కైఫీ అజ్మీ రాసినదో లేక బాగా ఇటీవలి కాలపు అమితాబ్-అక్షయ్-బాబీ డియోల్‌ల చెత్త చిత్రంలోనిదో తెలియదు. కానీ ఆ సందేశం మాత్రం ఏదో ఒక కొత్త చట్టం, కనీసం మొత్తం రాజకీయాధికారం కావాలి అనేది మాత్రం కాదు. "వ్యవస్థను" మార్చే విప్లవం సాగించాలనేదే.

అన్నా ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్న ఆనాటి నుంచి నేడు అది ఎక్కడికి చేరిందో చూద్దాం. అన్నా హజారే ఎక్కడుండాలో అక్కడికే చేరారు. రాలెగావ్ సిద్ధిలో ఏకాంతంగా తన ఊహాలోకంలోని దయ్యాలతో పోరాటం సాగిస్తున్నారు. అప్పుడప్పుడూ ప్రధాని చేపట్టిన ఏ చిన్నపాటి చర్యనో ప్రశంసిస్తూ లేదా కేజ్రీవాల్ చేసే చాలా పనులను విమర్శిస్తూ విజయ వంతంగా పతాకశీర్షికలను వేటాడు తున్నారు. ఆయన ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కీలక వ్యక్తుల్లో ఏ ఒక్కరూ నేడు ఆయనతో లేరు. కిరణ్ బేడీ, మనీష్ సిసోడియా, యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్, మేధా పాట్కర్ తదితరులంతా ఎన్నికల రాజకీయాల్లో చేరారు. పద్ధతి, ఉద్దేశాలకు సంబంధించి అన్నా ఉద్యమాన్ని ప్రశ్నిస్తూ దానితో తలపడ్డ మాలాంటివారి విషయానికి వస్తే.. మౌలిక మేధోపరమైన చర్చలో గెలుపొందామని మేం ప్రకటించగలం. వ్యవస్థను మార్చాలంటే, మీరు దాన్ని వాటేసుకోవాల్సిందే. దాన్ని మార్చాలంటే మీరు అధికారంలోకి రావాల్సిందే. ఎన్నికల రాజకీయాన్ని రొచ్చుగుంట అన్నాగానీ, మీరు దాన్ని ఈదుకుంటూ పోవాల్సిందే. అంటే, అధికారాన్ని చేపట్టడానికి ఉన్న ఏకైక మార్గం బ్యాలెట్ ద్వారా ప్రజా బాహుళ్యపు ఆమోదాన్ని పొందటమే అని. ఎన్నికల ప్రక్రియ ఆవశ్యకంగా న్యాయమైనది, ఓటర్లు తెలివిగలవారు, చాలావరకు అవినీతి సోకని బావతే. కేజ్రీవాల్ ఢిల్లీని తుడిచిపెట్టేశాక, పంజాబ్, గోవాలతో

జాతీయస్థాయి రంగ ప్రవేశం చేయనున్నారు. గుజరాత్‌లోనూ సరికొత్త సవాలుదారు కావచ్చని భయపెడుతున్నాడు. రాజకీయాలు, ఎన్నికలు అన్నీ బూటకమేనని కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీలు ఇక ఎంతమాత్రమూ అనలేరు. అన్నా హజారే ఉద్యమం రాజకీయాలకు వ్యతిరేకమైనదిగా నటించడాన్ని విమర్శిస్తూ మనలో కొందరు చెప్పింది సరిగ్గా ఇదే కాదా? "నిజాయితీగా మీకు రాజకీయాధికారం కావాలని చెప్పండి" అని మేం నిలదీశాం.

### కేజ్రీవాల్ బ్రాండ్ రాజకీయం

ఆమ్ ఆద్మీ పంజాబ్‌లో మొదటి స్థానంలో ఉన్నా లేక రెండో స్థానంలో ఉన్నా లేదా గోవాలో ఏ స్థానంలో నిలిచినా.. దాని జనాకర్షణ మాత్రం విస్తరిస్తోంది. గుజరాత్‌లో ఆ పార్టీ క్షేత్రస్థాయి కార్యకలాపాలు సైతం అదే సూచిస్తున్నాయి. అధికారాన్ని కోరుకుంటున్నా ఆప్ తన ప్రధాన భావజాల సారం 'వ్యవస్థకు వ్యతిరేకమైనది' అన్న ముద్రను ఇంకా ఎలాగో కాపాడుకోవడం విశేషం. భావజాలేతరమైన పార్టీగా ఉన్న దాని ఆకర్షణకు తోడు, బీజేపీకి దీటైన అతి జాతీయవాదపు నగిషీలు, అలంకారాలు సైతం ఉన్నాయి (ఇంకా అది భగత్‌సింగ్ పేరును వాడుతూనే ఉంది). కేజ్రీవాల్ తన ప్రచార కార్యక్రమాల్లో అరుదుగా తప్ప ప్రత్యేకించి ఏ ఒక్క పార్టీపైనా దాడిచేయరు. అన్ని పార్టీలపైనా, అంటే ఆచరణలో "వ్యవస్థ"కు సంబంధించిన రాజకీయ వేత్తలందరిపైనా దాడి చేస్తారు. ఆయన బ్రాండుకు ఉన్న కీలకమైన ఆకర్షణ 'గొప్ప విచ్ఛిన్నకుడు' అనే ఆ గుర్తింపే.

కేజ్రీవాల్, ఆయన అనుయాయులు అందరిదీ యువతరం, సాధారణంగా వారు అవినీతిపరులు కారన్నట్టుగానే కనిపిస్తారు (ఢిల్లీ పోలీసు, సీబీఐల ఎఫ్ఐఆర్‌లను నమ్మేవారు లేరు). అతి పెద్ద యువ ఓటర్ల పునాది ఆయనకు సానుకూలాంశం. ఆయన ప్రత్యర్థులలో కొందరు, సుఖ్‌బీర్ బాదల్, రాహుల్ గాంధీ అంత పెద్దవారేమీ కారు, చిన్నవారు కూడా. అయినాగానీ వారు వంశపారంపర్య రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించేవారు. కాగా, కేజ్రీవాల్ స్వయంకృషితో రాణించినవారు. గత చరిత్ర లేకపోవడం, అనుభవ రాహిత్యాలను ఆయన తనకు అనుకూలతగా, అమాయకత్వానికి మారుపేరుగా ఉపయోగించు కుంటున్నారు. అందువల్ల, మాకు కనీసం ఒక్క అవకాశం ఇవ్వండి అనే ఆయన మాట యువ ఓటర్లను మరింత ఎక్కువగా ఒప్పించగలిగేదిగా ఉంటోంది.

### భావజాలం కోసం అన్వేషిస్తున్న భావజాల రహిత పార్టీ

కాంగ్రెస్ ఓట్లను తుడిచిపెట్టేయటం ద్వారానే కేజ్రీవాల్ ఢిల్లీలో ఘనవిజయం సాధించారని మనకు తెలుసు. పంజాబ్‌లో ఆయన అకాలీ–బీజేపీ కూటమి ఓట్లను ఎక్కువగా రాబట్టుకుంటారనడం సమంజసమే అవుతుంది. నిజమైన భావజాలమంటూ లేకపోవడం లేదా ఒక రాష్ట్ర రాజకీయ అవసరాలకు పూర్తిగా అనుగుణమైనది కాగలిగినదిగా ఆవిర్భవిస్తున్న భావజాలం ఉండటం దానికి సానుకూలతగా లెక్కించాలి. అయితే ఇంతకు మించి ఆప్‌ను సువ్యవస్థితమైన పార్టీల నుంచి వేరుచేసేది ఏమైనా ఉందా? ఆ పార్టీలలో మనం ఉన్నాయనుకుంటున్న లోపాలన్నింటి జాబితాను తయారు చేయండి. అవినీతి, వయసు, అధికారంలో ఉండటం అనే అంశాలను మినహాయిస్తే.. అందులో ఉన్న వ్యక్తిపూజ, అంతర్గత ప్రజాస్వామ్యం లోపించటం, అధిష్టాన వర్గపు సంస్కృతి, మీడియా విమర్శల పట్ల అసహనం, లోతైన ఉదారవాద వ్యతిరేకత, ఎలాంటి అసమ్మతిని, ప్రశ్నించడాన్ని సహించని అత్యంత శక్తిమంతుడైన సుప్రీం తరహాలో నేత తదితరాలను చూడండి. వాటిలో ఏమన్నా ఆప్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో కనిపించనివి ఏమైనా ఉన్నాయేమో సరిచూడండి. ఆ పార్టీ నేత ఎంతటి అత్యంత శక్తిమంతుడంటే తాను పరిపాలిస్తానని ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్రాన్ని (ఢిల్లీ) వదలి దాదాపు కొన్ని వారాలు సుదూరంలోని నగరంలో గడిపారు. ఏ రాజ్యాంగపరమైన లేదా పార్టీపరమైన జవాబుదారీతనంలేని రాహుల్ ఏడాది చివర్లో ఒకవారం విశ్రాంతి తీసుకున్నందుకు విమర్శల వెల్లువను ఎదుర్కొన్నారు.

అన్నా హజారే ఉద్యమం మొదలైన ఎనిమిదేళ్ల తర్వాత, అది ఒక జాతీయస్థాయి రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది. బలమైన నాయకుని నేతృత్వంలో అది ఒక భావజాలం కోసం అన్వేషిస్తోంది. ఆ భావజాలం, ఆ నాయకుడు నిజంగా విశ్వసించేదే కానవసరం లేదు. కనీసం మనకు సుపరిచితం కాని భావజాలమది. నిలకడగా నిలిచిపోయిన, వినుగెత్తించే మన రాజకీయాలకు అది ఒక కొత్తకోణాన్ని తీసుకొచ్చింది. అది రాజకీయ రిపోర్టర్లుగా, అభిప్రాయ రచయితలుగా మన ఉద్యోగాల్లోకి మరింత సరదాను తెచ్చింది. మనం మరి కొంత దూషణను ఎదుర్కొంటే పోయేదేముంది?

**తాజా కలం :** ఇటీవల కాలమ్ (జాతిహితం)లో నేను పంజాబ్‌లో ఆప్ పెద్ద శక్తిగా ఆవిర్భవించడం గురించి రాసినందుకు నన్ను ప్రశ్నలు ముంచెత్తాయి. ఆప్ అధినేత సోషల్ మీడియాలో నన్ను తిట్టిపోసినాగానీ నేనిలాంటి సానుకూల నివేదికను ఎలా ఇస్తానని ప్రశ్నించారు. ఎవరైనా నన్ను తిట్టిపోసినంత మాత్రాన నేను నా వార్తానివేదికల్లో అబద్ధాలాడాలా? తద్వారా నా పాఠకుల నమ్మకాన్ని దుర్వినియోగం చేసుకోవాలా? ట్రంప్ లేదా నరేంద్ర మోదీ లేదా అరవింద్ కేజ్రీవాల్ ఎవరి విషయంలోనైనా వార్తలను అందించేటప్పుడు మనం వేసుకోవాల్సిన ప్రశ్న అదే అని భావిస్తాం.

(కర్టెసీ: సాక్షి) ★

# విద్య విషయంలో మోసాన్ని గుర్తించాలి



ప్రభుత్వం అందరు పిల్లలకూ సమానంగా నాణ్యమైన విద్యను అందించకుండా చేస్తున్న మోసాన్ని ప్రజలు గుర్తించాలని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దగళ్ల రాజీవ్ విజ్ఞప్తి చేశారు. అందరికీ మంచి ప్రమాణాల విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, కానీ దశాబ్దాలుగా పాలకులు ఆ కీలక బాధ్యతను దాటవేస్తూ వస్తున్నారన్నారు. మంచి చదువు లేకుండా బాగు పడ్డ దేశం ప్రపంచంలో ఏదైనా ఉందా? అని ప్రశ్నించారు. అంత ముఖ్యమైన చదువును గాలికొదిలేసిన పాలకులను, పార్టీలను క్షమించకూడదన్నారు. విద్యను అంగడిసరకుగా మార్చి, ''కొన్నోడికి కొన్నంత'', ''రేటుకో విద్య'' సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారన్నారు. సర్కారీ బడుల్లో అంత మంచి చదువు అందిస్తుంటే, టీచర్లు, రాజకీయ నాయకులు తమ పిల్లల్ని ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లకు ఎందుకు పంపుతున్నారని అడిగారు. ఉన్నోడు – లేనోడు వ్యవస్థ పోవాలంటే మంచి చదువే మార్గమన్నారు.



నాగర్ కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలంలోని ఆలేరు గ్రామంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంబేద్కర్ యువజన సంఘం, ఆదర్శ యూత్‌ల ఆధ్వర్యంలో దీన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రాజీవ్ మాట్లాడుతూ, సామాన్య వర్గాల పిల్లలకు ఉపయోగపడేలా లైబ్రరీని తీర్చిదిద్దాలని కోరారు. గ్రంథాలయానికి ఆర్థికసాయం అందించిన ముదిగొండ వెంకటేష్‌ని అభినందించారు.

కార్యక్రమంలో అతిథులుగా సబ్–ఇన్‌స్పెక్టర్ కనకయ్య, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఈ లైబ్రరీలో ఉచితంగా ట్యూషన్లు కూడా చెబుతున్నామని, విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని పెంచాలనుకునేవారు మంచి పుస్తకాల్ని గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వొచ్చని నిర్వాహకులు తెలిపారు.

పుస్తకాలు పంపాల్సిన చిరునామా:

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, ఆలేరు,


తెల్కపల్లి (మండలం), నాగర్ కర్నూల్ జిల్లా – 509 412

ఫోన్: 80960 87911 ★

# అవార్డు ఎవరికిచ్చినా.. ఆ క్రెడిట్ మాత్రం తెలుగువారిదే!



**జా**తీయ రహదారులపై ప్రమాదాల బారిన పడినవారిని గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి రక్షించేందుకు కృషి చేస్తున్న ది లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా॥ సుబ్రొతొ దాస్‌కి 2017లో పద్మశ్రీ అవార్డును ప్రకటించారు. అహ్మదాబాద్ – బరోడా మధ్య హైవే మీద జరిగిన ప్రమాదంలో తాను, తన భార్య ఎదుర్కొన్న నరకయాతన సుబ్రతొను లైఫ్ లైన్ ఏర్పాటు దిశగా నడిపించింది. యాక్సిడెంట్ తర్వాత కొన్ని గంటలపాటు ఎటువంటి సాయం సుబ్రతొ దంపతులకు అందలేదు. అటువంటి సమయాలలో వేగంగా స్పందించే లైఫ్ లైన్ ప్రస్తుతం నాలుగు రాష్ట్రాల్లో సేవలందిస్తోంది.. ఆయన వైద్యసేవాభావాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాన్ని ఇచ్చిందనుకుంటే గొడవ లేదు. కానీ 108 సర్వీసులకు కూడా ఆద్యుడు సుబ్రతొ, అందుకే ఆయనకు పద్మశ్రీ వచ్చింది అని వార్తలు వచ్చాయి. సాటి తెలుగువారు చేసిన కృషిని కూడా మనం విస్మరిస్తుండటంతో.. తెలుగునాట కూడా ఇదే ప్రచారం జరిగింది. అయితే వాస్తవాలు వేరు.




108 సేవలు కార్యరూపం దాల్చటానికి కృషి చేసింది సత్యం రామలింగరాజు. సత్యం కంప్యూటర్లలో భారీ లాభాలు రావడంతో రామలింగరాజు సోదరులు కొంత సంపదని తండ్రి పేరు మీద సమాజం కోసం ఖర్చు చేయాలని బైర్రాజు ఫౌండేషన్‌ని స్థాపించారు. ఈ ఫౌండేషన్ తరపున ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో 200 గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, తాగునీరు వంటి రంగాల్లో మెరుగైన సేవలందించారు. 2003 జులై 16న పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ప్రాంతంలో 19 గ్రామాలలో 3 అంబులెన్స్‌లతో 'సహాయ' పేరుతో అత్యవసర వైద్యసేవల విభాగాన్ని బైర్రాజు ఫౌండేషన్ ప్రారంభించింది. దీనికి మంచి స్పందన రావటంతో రాష్ట్ర వ్యాప్తంగా 108 సేవలకి ఆలోచన వచ్చింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత ప్రభుత్వ తోడ్పాటుతో 2005లో ప్రారంభమైన 108ని గుజరాత్‌లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా అమలు చేయాలని భావించింది. దానికి సంబంధించి అధ్యయనం కోసం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారిని కూడా ఏపీకి పంపింది. ఆ తర్వాత 2007లో గుజరాత్‌లో అత్యవసర వైద్యసేవల చట్టం వచ్చి 108 సర్వీసులు ప్రారంభమయ్యాయి. వాటికి సుబ్రతొకు ఎటువంటి సంబంధం లేదు. అమెరికాలో 911 అత్యవసర సేవల స్ఫూర్తితో తెలుగునాట మొదలై వెంకట్ చెంగవల్లి, డా॥ ఏపీ రంగారావు వంటి వారి కృషితో దేశంలోని పలు రాష్ట్రాలకు క్రమంగా విస్తరించిన 108.. ఈఎంఆర్ఐ తర్వాత వచ్చిన జీవీకే యాజమాన్యంలోకి వచ్చాక 14 రాష్ట్రాలకు విస్తరించి 80 కోట్ల మందికి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 5 కోట్ల ఎమర్జెన్సీలలో సుమారు 2కోట్లమందిని 108లు కాపాడగలిగినట్టు అంచనా.

జాతీయ ఆరోగ్య మిషన్‌ని రూపొందించిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 108 ప్రతిపాదనను ఎంతో ప్రోత్సహించి, ప్రజారోగ్య విధానంలో ఈ సేవల్ని భాగం చేసేందుకు దోహదం చేశారు. 108 కోసం సత్యం రామలింగరాజు లాభాపేక్ష లేని సొసైటీ తరహాలో ప్రారంభించిన 'ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఈఎంఆర్ఐ)లో సభ్యులుగా కూడా జేపీ సేవలందించారు. 108 విస్తరించటానికి ఎంతో దోహదపడ్డారు. రామలింగరాజుపై సత్యం కుంభకోణం బైటపడ్డప్పుడు మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాం ఈఎంఆర్ఐ బోర్డు నుంచి తప్పుకుంటానన్నా, జేపీ ఎంతో వారించారు. సంస్థ మారినా సేవలు కొనసాగటంలో కీలకపాత్ర పోషించారు.

ఇవీ వాస్తవాలు. 108ని సుబ్రతొ దాస్‌తో ముడిపెట్టి వార్తలు వచ్చిన నేపథ్యంలో దీనికి సంబంధించి పలు వివరాల్ని ఈఎంఆర్ఐ మాజీ కన్సల్టెంట్, ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో)గా ఉన్న వనం జ్వాల నరసింహారావు తన బ్లాగ్ ద్వారా, ఓ ప్రముఖ దినపత్రికలో వ్యాసం ద్వారా వెల్లడించారు. ★

# ఎఫ్‌డీఆర్ రూపొందించిన విద్య, వైద్య విధానాలకు అంతర్జాతీయ గుర్తింపు




లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) దేశ సుస్థిరాభివృద్ధికి కీలకమైన ఆరోగ్యం, విద్య రంగాలలో రూపొందించిన విధానాలకు ప్రఖ్యాత పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం రూపొందించిన గ్లోబల్ గో టు థింక్‌ట్యాంక్ ఇండెక్స్ నివేదికలో స్థానం లభించింది.

ఉత్తమ జాతీయ ఆరోగ్య విధానాన్ని రూపొందించిన థింక్ ట్యాంక్, అత్యుత్తమ విధాన అధ్యయన నివేదిక (జాతీయ విద్యావిధానానికి రూపొందించిన ముసాయిదా) రూపకర్తగా ఎఫ్‌డీఆర్‌ను నివేదిక పేర్కొంది.

**ఎఫ్‌డీఆర్ ఆరోగ్య విధానం :**

అందరికీ ఆరోగ్యం అందించే దిశగా– ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో గ్రామాలలో చివరి పౌరుని వరకూ వైద్యం అందించటం, వ్యాధి నివారణ, ప్రాథమిక ఆరోగ్యం, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థకు ప్రాధాన్యం, రెండో దశ వైద్యానికి ప్రజలు ప్రభుత్వ లేదా చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలను ఎంచుకునే ఏర్పాటు, వ్యాధి తృతీయ దశలో ఆధునీకరించిన ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స వంటి ఆచరణసాధ్యమైన ప్రతిపాదనలతో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా జాతీయ ఆరోగ్య విధానం నమూనాని రూపొందించి నీతి ఆయోగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది.

**విద్యావిధానం :**

ఉత్తమ విద్యాప్రమాణాలతో మెరుగైన ఫలితాలను సాధించేందుకు– ఉపాధ్యాయులు, పాఠశాలల చుట్టూ కాకుండా విద్యార్థి చుట్టూ నిధుల కేటాయింపు, విద్యార్థుల సంఖ్యను పెంచే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల జీతాల పెంపు, జిల్లా స్థాయి స్వతంత్ర పరీక్షా బోర్డు ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ, పాఠశాలల సంఖ్యను హేతుబద్ధీకరించటం, పేద విద్యార్థులకు రవాణా సబ్సిడీ ఇవ్వటం, తల్లిదండ్రులని పాఠశాలల నిర్వహణలో భాగస్వాముల్ని చేయటం వంటివి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన జాతీయ విద్యావిధానం సూచనల్లో ఉన్నాయి.

(ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ప్రతిపాదించిన అందరికీ అందుబాటులో ఆరోగ్యం, అందరికీ నాణ్యమైన విద్య విధానాల పూర్తి వివరాల్ని **www.fdrindia.org** లో చదవొచ్చు) ★

# ఉత్తరాంధ్ర పట్ల వివక్షకు వ్యతిరేకంగా లోక్‌సత్తా మౌనదీక్ష

**వెనకబడిన జిల్లాలకైనా పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనకు**

**మద్దతు పలికిన దాడి, కొణతాల, వివిధ పార్టీల, సంఘాల నేతలు**



ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల గత పాలకులు అనుసరించిన వివక్షనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తు న్నారని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తీరు వల్ల ఈ ప్రాంతం తీవ్ర నష్టానికి గురవుతోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన ప్రత్యేక హోదాకు పార్లమెంటులో హామీ లభించినా సాధించటంలో చంద్రబాబు విఫలమయ్యారని, కనీసం వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు పారిశ్రామిక రాయితీల్ని అడిగే ప్రయత్నం కూడా చేయలేదని అన్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాకి 12, విజయనగరానికి 10, విశాఖపట్టణానికి 13 హామీల్ని ప్రకటించి 33 నెలలు గడిచిపోయినా ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ వద్దనున్న గాంధీ విగ్రహం దగ్గర భీశెట్టి బాబ్జీ, ఇతర లోక్‌సత్తా నేతలు మౌనదీక్షను నిర్వహించారు. వామపక్షాలు, వైసీపీ, పలు ప్రజాసంఘాలు, మాజీ మంత్రులు దాడి, కొణతాల సంఘీభావం తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని నేతలు ముక్తకంఠంతో అన్నారు. ఇతర రాష్ట్రాల మద్దతును కూడగట్టి.. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా వెనకబడిన జిల్లాలకైనా పారిశ్రామిక రాయితీల్ని సాధించుకోవాలని లోక్‌సత్తా చేసిన ప్రతిపాదనకు పలువురు మద్దతు పలికారు. పన్ను రాయితీలతో ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకి వెంటనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నోటికి నల్లగుడ్డతో దీక్షను ప్రారంభించటానికి ముందు.. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయాన్ని సవివరంగా తెలియచేసే లోక్‌సత్తా కరపత్రాన్ని బాబ్జీ విడుదల చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో పలు పరిశ్రమలు మూతపడి యువతకు ఉపాధి కరవైందని, సాగునీరు, వ్యవసాయంలో నిస్తేజంతో రైతులు కుంగిపోయారని ఈ సందర్భంగా అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి అవినీతిని పెంచారు తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. సెటిల్‌మెంట్లు, ఇసుక, భూదందాలు విచ్చలవిడి అయ్యాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు తెలియచేసేందుకు, పరిష్కారాలను చూపేందుకే లోక్‌సత్తా ఈ దీక్షను చేస్తోందని బాబ్జీ అన్నారు.

రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదాతో పారిశ్రామిక రాయితీలు ఇవ్వటం సాధ్యం కాకపోతే వెనకబడిన ఉత్తరాంధ్ర,

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలను అభివృద్ధి చేస్తామని, సమతౌల్య ప్రాంతీయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని నగరాన్ని ప్రకటించడంతో పాటు రాష్ట్రంలోని ఏ జిల్లాకు ఏ ప్రాజెక్టులు, కార్యక్రమాలు అమలు చేయబోతున్నామో ఆయన శాసనసభలో విస్పష్టంగా ప్రకటించారు. 33 నెలల తరువాత హామీల పరిస్థితి ఏంటో ప్రజలు గమనించగలరు.

# ఉత్తరాంధ్ర జిల్లాలకు హామీల తోరణాలు

**శ్రీకాకుళం**

1. నూతన పారిశ్రామిక నగరం
2. భావనపాడు పోర్టు
3. కళింగపట్నం పోర్టు
4. పైడి భీమవరం పారిశ్రామిక వాడ (వి.సి.ఐ.సి. కారిడార్)
5. నూతన ఎయిర్‌పోర్ట్
6. శ్రీకాకుళాన్ని స్మార్ట్‌సిటీగా రూపొందించడం
7. ఫుడ్ పార్క్
8. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్
9. వంశధార-నాగావళి పై వున్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయడం.
10. తెలినీలాపురం – పక్షుల సంరక్షణ కేంద్రం, బౌద్ధ చారిత్రక కట్టడాలు, శ్రీకూర్మం మరియు అరసవెల్లి దేవాలయాలను కవర్ చేస్తూ పర్యాటక కేంద్రాలు, బారువ బీచ్.
11. ఓపెన్ యూనివర్శిటీ
12. ఎలక్ట్రానిక్స్ మరియు హార్డ్‌వేర్ పార్క్

**విజయనగరం :**


1. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం
2. పారిశ్రామిక నగరం
3. ఏడాది కాలంలో తోటపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయడం
4. ఫుడ్ పార్క్
5. గిరిజన యూనివర్శిటీ
6. విజయనగరాన్ని స్మార్ట్‌సిటీగా రూపొందించడం.
7. ఎలక్ట్రానిక్ మరియు హార్డ్‌వేర్ పార్క్
8. పోర్టు
9. సంగీతం మరియు లలిత కళల అకాడమీ ఏర్పాటు.
10. మెడికల్ కాలేజీ

**విశాఖపట్నం**

1. మెగాసిటీ
2. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం
3. వి.సి.ఐ.సి. పారిశ్రామికవాడ
4. మెట్రోరైల్
5. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్
6. ఇండియన్ ఇనిస్టిట్యూట్‌ఆఫ్ ఫారిన్‌ట్రేడ్
7. మెగా ఐ.టి. హబ్
8. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కేంద్రం
9. ఇన్నోవేషన్ మరియు ఇన్‌కుబేషన్ హబ్
10. ఫుడ్ పార్క్
11. ఎగ్జిబిషన్ మరియు కన్వెన్షన్ సెంటర్
12. గంగవరం ఎల్.ఎన్.జి టెర్మినల్
13. రైల్వేజోన్

రాయలసీమ జిల్లాలకైనా ఈ రాయితీల్ని ఇవ్వాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన సూచనకు తాము పూర్తి మద్దతునిస్తున్నామని మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, నూతన రాష్ట్రంలోనూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాబు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి జేపీ అనేక సూచనలు, సలహాల్ని ఇస్తున్నా చంద్రబాబు పట్టించుకోకపోవటం విచిత్రంగా ఉందన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్ని వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పట్ల బీజేపీ, టీడీపీ చిన్న చూపు చూస్తున్నాయని మండిపడ్డారు. కట్టుకథలతో చంద్రబాబు పాలన సాగుతోందని, ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారానికి పోరాడాలని వైసీపీ నేత గుడివాడ అమరనాథ్ అన్నారు. దీక్షలో వామపక్షాల నేతలు పైడిరాజు, గంగారామ్, మార్కండేయులు, ఏసీపీ నాయకులు కంటుభక్త రామానాయుడు, ఎంఎల్‌సీ అభ్యర్థి, లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, దళిత నేత ఆదాడ మోహన్, గాయకులు దేవిశ్రీ, ఉదయ్ భాస్కర్, వైసీపీ నేతలు కొయ్య ప్రసాద్ రెడ్డి, అమర్ పాల్గొని సంఘీభావం తెలిపారు, లోక్‌సత్తా పార్టీ నేతలు పంచాది రాంబాబు, ఎంఎస్ఎన్ మూర్తి, ముదునూరి రాజ్‌వర్మ, మామిడి సత్యనారాయణ, అల్లంశెట్టి నాగభూషణం, కాంద్రేగుల ప్రసాద్, పక్కి శంకర్, చిరంజీవి, భాస్కర్, యల్లపుకృష్ణ, అత్తిలి రాజు, గాంధీ, సత్యం, దాలినాయుడు, మౌళి, హరిగణేష్, లెక్కల శ్రీను, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ★

# ఏపీలో ఆర్భాటాలు, ప్రగల్భాల పాలన, ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి: జేపీ




ఆంధ్రప్రదేశ్‌లో రోజుకో ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆర్భాటం తప్ప ప్రజల జీవితాలకు ఉపయోగపడే పాలన లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బిడ్డలకు ఉపాధి అవకాశాల్ని కల్పిద్దాం, కోట్లాది మంది జనం జీవితాల్ని బాగు చేసే విద్య, ఆరోగ్యాలను నాణ్యమైనవిగా తీర్చిదిద్దుదామనే దీర్ఘకాలిక దృక్పథమే రాష్ట్ర ప్రభుత్వంలో కరువైందన్నారు. నిజాయతీతో కూడిన ప్రయత్నం లేకుండా మ్యాజిక్‌లు, చిట్కాలతో ఏ రాష్ట్రమూ బాగుపడలేదన్నారు. ఆర్భాటాలు, ప్రగల్భాలు రాష్ట్రంగా, పత్రికల్లో ప్రచారం పొందే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలి పోతుండటం విచారకరమన్నారు.

లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రమణ్యం, ఇతర నాయకులతో కలిసి విజయవాడ పార్టీ కార్యాలయంలో మీడియాతో జేపీ మాట్లాడారు.

ప్రత్యేక హోదానా, ప్రత్యేక ప్యాకేజీనా అనే చర్చతో రాజకీయాలు చేయటం వల్ల కాలయాపన జరిగి రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందని జేపీ అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ ఆదాయం నష్టపోయే నూతన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తుకు భరోసా కోసం పారిశ్రామిక రాయితీల కోసం ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదనను తొలుత తానే చేశానని గుర్తుచేశారు. పేరు ఏదైనా పారిశ్రామిక రాయితీల కోసం ఇప్పుడు అందరూ పోరాడాల్సుందన్నారు. కనీసం వెనకబడిన జిల్లాలకైనా పారిశ్రామిక రాయితీల్ని సాధించాలన్నారు. ఈ రాయితీలుంటేనే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

ఎన్నికలు వస్తున్నాయి, పోతున్నాయి తప్ప జనం జీవితంలో మార్పు గురించి ఆలోచించే రాజకీయాలు కరువవుతున్నాయని.. ఫిరాయింపులు, ఎమ్మెల్యేలను బుజ్జగించటాలు, సొంత ఆస్తుల్ని పెంచుకోవటం, వచ్చే ఎన్నికలకు నల్లడబ్బు వెనకేసుకోవటంతోనే ఐదేళ్లూ గడిచిపోతున్నాయని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టి గెలిచాం కాబట్టి తాము అవినీతికి పాల్పడటంలో తప్పేమీ లేదన్నట్టు ఎమ్మెల్యేలు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. తమిళనాడులో ప్రజలు వ్యతిరేకిస్తున్నా కూడా ఎమ్మెల్యేలు అవినీతి డబ్బు కోసమే శశికళ వర్గంలో చేరారన్నారు. పోలింగ్ రోజు తప్ప ప్రజల గురించి ఎవరూ పట్టించుకోవటం లేదని, ఒకసారి గెలిచాక ఎమ్మెల్యే ఐదేళ్లపాటు జాగీర్దార్‌లాగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. ఈ విషవలయం నుంచి బైటపడి సమర్థత, నిబద్ధత గలవారు పాలకులు కావాలంటే ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక అవసరమన్నారు.

ముఖ్యమంత్రికి ప్రత్యక్ష ఎన్నిక ఉంటే.. రాష్ట్రమంతటా వేల కోట్లు ఖర్చు చేసే ధైర్యం ఎవరూ చేయరని, అలాగే సీఎం పదవి కాపాడుకోవటం కోసం ఎమ్మెల్యేల అవినీతిని సహించాల్సిన అవసరం ఉండదని జేపీ అన్నారు. సమాజంలోని మెరుగైన వ్యక్తులను, నిపుణులను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కూడా ముఖ్యమంత్రికి కలుగుతుందన్నారు. ఎమ్మెల్యేల పాత్ర అసెంబ్లీకి పరిమితమవుతుందన్నారు. సీఎం మరీ నియంతలా వ్యవహరిస్తే ఈ అసెంబ్లీ కట్టడిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వల్ల ప్రజలకు మంచి పాలన అందటంతోపాటు స్థానిక ప్రభుత్వాలు కూడా బలోపేతమై రోజువారీ సేవలు ఎంతో మెరుగుపడతాయన్నారు. ఇలాంటి పాలనలో కేంద్రంలో ఎవరున్నా ప్రజలకు ఇబ్బంది ఉండదన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, బలమైన స్థానిక ప్రభుత్వాల వల్ల ప్రజల నుంచి యువ నాయకత్వం తయారై 'ఇస్రో'లోలా విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లోనూ విజయాలు సాధ్యమవుతాయని, లేకుంటే కుటుంబ వారసత్వం, నల్లడబ్బు రాజకీయాలే కొనసాగుతాయని అన్నారు. ఈ రకమైన ఎన్నికల సంస్కరణల కోసం మార్పు కోరేవారంతా పోరాడాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ★

# తమిళుల నుంచి కళాభిమానం నేర్చుకుందాం, ప్రజల సృజన శక్తితో సమాజం ఎదుగుతుంది: జేపీ





తమిళనాడు తరహాలో మనలోనూ భాష, కళల పట్ల అభిమానం పెంపొందాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ఒంగోలు, చుట్టుపక్కల కొన్ని ప్రాంతాలలో జరుగుతున్న కళాసంబరాలు, ప్రదర్శనలు తెలుగు సంస్కృతికి ప్రాణం పోస్తున్నాయన్నారు. ఒంగోలు పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో ఇటీవల జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ జాతీయ నాటకోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. వివిధ కళారూపాలు ప్రదర్శించినవారిని, సాయినాథుడు చిత్రాన్ని గీసిన విఘ్నేష్ తేజని, కళాపరిషత్ స్టాల్స్ నిర్వాహకుల్ని అభినందించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, ప్రజల్లో సృజన శక్తిని పెంచాలని, అది కళల ద్వారానే సాధ్యమవు తుందని అన్నారు. కళ, సృజన శక్తి, సంస్కృతి సహజంగా మానవుడికి వచ్చాయని, అవి ప్రస్తుతం తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సృజన శక్తి పెరిగితే ఉన్నత ప్రమాణాలు గల సమాజం ఏర్పడుతుందన్నారు. కళలను బతికించే నాయకత్వం, పనికి వచ్చే విద్య, అందరికీ అవకాశమిచ్చే సమాజం కావాలన్నారు. మనకున్న కళలను తమిళులు బతికించారని, లేకపోతే ఎప్పుడో అంతరించి పోయేవన్నారు. చెడును తొలగించి జాతిని మేలుకొల్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. అనంతరం ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఎక్కడెక్కడ సంపద సృష్టించుకుంటారో ఆయా ప్రాంతాలు, చుట్టుపక్కల సమాజం అభివృద్ధి చెందుతాయన్నారు. బాలికల్ని ప్రోత్సహిస్తే మెరుగైన సమాజాన్ని చూస్తామన్నారు.

కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా కూచిపూడి అకాడమీవారు ప్రదర్శించిన నర్తనశాల నృత్యరూపకం భళా అనిపించింది. ఎంతటి బలవంతుడైనా పరస్త్రీ లోలుడైతే పతనం చెందక తప్పదని చాటిన ఈ రూపకానికి డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి రచన, దర్శకత్వం వహించారు. కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు వారిని అభినందించారు. తెలుగు రోజు పేరిట చిన్నారులకు నిర్వహించిన పోటీలో.. తెలుగు నుంచి ఆంగంలోకి, ఆంగ్లం నుంచి తెలుగులోకి చకచకా పదాల్ని అనువదించి పలువురు అబ్బురపరిచారు. భారతీయం కన్వీనర్ ఈదర భరత్ వారిని ప్రశంసించారు.

ఎనికపాడు గ్రామానికి చెందిన ప్రజానాట్యమండలి బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అమరావతి సొసైటీ ఆఫ్ కల్చరల్ అసోసియేషన్, నందలూరు వారు బీఎం బాషా రచన, బి. సాయి సందీప్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'బంగారుకొండ' బాలల సాంఘిక నాటకం కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులలో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులకు తెలియచెప్పింది.

అలాగే చిన్నారులకు విజ్ఞానపోటీలు, మాడభూషి దివాకర్ బాబు రచన, పిఠాపురం బాబూరావు దర్శకత్వంలో పెద్దాపురం మండలం చంద్రమాంపల్లికి చెందిన స్నేహ ఆర్ట్స్ ప్రదర్శించిన 'నమో నమ:' యువ నాటిక ఆకట్టుకున్నాయి. డాక్టర్ చుంచు రామయ్య, సీనియర్ న్యాయవాది చెరుకూరు వెంకటేశ్వర్లు, రంగా కిసాన్ సంస్థ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ★

ఓ నాయకుడికో, నాయకురాలికో వ్యక్తిగత నిజాయతీ ఉంటేనే మనం చాలా గొప్పగా చెప్పుకుంటుంటాం. జాతీయోద్యమంలో, ఆ తర్వాత కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలలో, జనసంఘ్‌లో, ఆ తర్వాత బీజేపీలో గల చాలామంది వ్యక్తిగత నిజాయతీపరులను మనం ఎంతో గౌరవిస్తుంటాం. కాలం గడుస్తూ ప్రస్తుత రాజకీయాలకొచ్చేసరికి.. వ్యక్తిగత నిబద్ధతతో ఉండటం కూడా కష్టం కావటంతో, అలాంటి నిజాయతీపరులను ఇప్పుడు దేవుళ్లలా భావిస్తున్నాం. ఆ నాయకులు కూడా.. తమ నిజాయతీని కథలుకథలుగా చెప్పుకుంటూ తాము ఎన్నికల్లో గెలవటానికి, పురస్కారాలను అందుకోవటానికి అంతకంటే అర్హత అక్కర్లేదన్నట్టు వ్యవహరిస్తుంటారు. మీడియా హీరోల్లో కూడా ఇలాంటివారే ఎక్కువ. 'వ్యక్తిగత నిజాయతీ అనేది కనీస అర్హత మాత్రమే, నిజమైన నాయకులకు కావలసినది వ్యవస్థీకృత నిజాయతీ' అనే ఆలోచనను మనం ఇంకా అంగీకరించలేకపోతున్నాం.




# మోదీ వ్యక్తిగత నిజాయతీ చాలదు, భారత్‌కు వ్యవస్థల నిర్మాణం కావాలి: హెచ్చరిస్తున్న తాజా సూచీ

రాజకీయాలలో నిజాయతీపరులు ఎన్నిక కావటానికి వ్యవస్థను మార్చే సంస్కరణలు తేకుండా.. కేవలం వ్యక్తిగత నిజాయతీ పరులు ఎన్నికైతే పెద్ద విజయమన్నట్టు వ్యవహరించటం ఈ దేశప్రయోజనాలకు లాభం కంటే నష్టమే చేకూరుస్తుందని స్పష్టంగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యక్తిగత నిజాయతీపరులు అధికారంలో ఉంటే.. తాము అవినీతికి పాల్పడకుండా, మిగతావారికంటే పదిశాతమో, ఇరవై శాతమో ఎక్కువ సమర్థవంతంగా పనిచేసి కాస్త మెరుగైన ఫలితాలను చూపగలుగుతారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వమే ఇందుకు ఉదాహరణ.

మోదీ విధానాలకన్నా, ఆయన నిజాయతీ, ధైర్యం, కష్టపడటం వంటి లక్షణాలే ఆయన్ను ఎక్కువశాతం ప్రజల దృష్టిలో హీరోగా కొనసాగిస్తున్నాయి. దీనివల్ల దేశం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందటం లేదు. యువతకు ఉద్యోగాలు రావటం లేదు. ఏ కుటుంబంలో పుట్టారన్న అంశం ఆధారంగానే ఇంకా బిడ్డల భవిష్యత్తు నిర్ణయమైపోతోంది. ఎదుగుదలకు కీలకమైన నాణ్యమైన విద్య, ఆరోగ్యం ప్రతి బిడ్డకూ అందటం లేదు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా అందాల్సిన సేవలకు దేబిరించాల్సి వస్తోంది. లంచాలివ్వాల్సి వస్తోంది. రోడ్డు మీదకెళ్లి భద్రంగా తిరిగొస్తామన్న గ్యారంటీ లేదు. స్థానికంగా చిన్న పని కావాలన్నా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, ఒక్కోసారి ప్రధానమంత్రిని కూడా అడగాల్సి వస్తోంది. ప్రజల జీవితాల్ని బాగుచేయగలిగిన ఈ అంశాలు సక్రమంగా ఉండేలా చూడటం మోదీ పని తప్ప.. తాను నిజాయతీగా ఉంటే చాలని వీటన్నిటినీ పట్టించుకోకపోవటం కాదు గదా!

.. ఈ వాస్తవాల్నే తాజాగా అమెరికాకు చెందిన ప్రముఖ మేధో సంస్థ ది హెరిటేజ్ ఫౌండేషన్ కూడా తేల్చిచెప్పింది. మోదీ విదేశాంగ విధానంలో చేసిన కృషిని, దేశంలో అభివృద్ధి సాధించేందుకు పడుతున్న కష్టాన్ని ప్రశంసిస్తూనే.. విధానాలపరంగా బలమైన పునాది లేకపోవటం వల్ల భారత వృద్ధిలో సుస్థిరత కష్టమని విశ్లేషించింది. అవినీతి, అధ్వాన్నమైన మౌలిక సదుపాయాలు, నిధుల్ని ఇష్టమొచ్చినట్టు వినియోగించటం వంటి అంశాలు భారత్‌ను వెనక్కులాగుతున్నాయని తెలిపింది. చట్టబద్ధ పాలన, న్యాయవ్యవస్థ పటిష్టత, ప్రభుత్వ ఖర్చు వంటి కీలకాంశాల్లో భారత్ పేలవంగా ఉండటంతో.. ఆర్థికస్వేచ్ఛలో భారత్‌కు 143వ స్థానాన్ని ఈ సంస్థ ఇచ్చింది. గత ఏడాది కన్నా ఈ ర్యాంకింగ్‌లో మనదేశం ఇరవై స్థానాలు దిగజారింది.

ఈ సూచీ నివేదిక పట్ల సందేహాలు వ్యక్తంచేయొచ్చు, దబాయించొచ్చుగానీ.. సరైన వ్యవస్థల్ని ఏర్పరచుకోకుండా కేవలం వ్యక్తిగత నిజాయతీ, సామర్థ్యాలున్న నాయకులతో భారతదేశం సుస్థిరాభివృద్ధిని సాధించే అవకాశాలు లేవని మాత్రం ఆలస్యంగానైనా ప్రతి ఒక్కరూ గుర్తెరగాల్సి ఉంది. ★

# సంస్కరణలతోనే ఉదారవాదం,
# ఉదార సంస్కృతితోనే సుఖసంతోషాల జీవితం




రాజకీయ, పాలనా, సామాజిక సంస్కరణలను విస్మరించటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉదారవాదం ఎదుర్కొంటున్న సవాళ్లను, ఉదారవాద సంస్కృతిని ప్రజల్లో పెంపొందించేందుకు చేయాల్సిన ప్రయత్నాన్ని ఇటీవల ముంబయిలో జరిగిన ఆసియా లిబర్టీ ఫోరంలో వివరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 07-03-2017

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on March1st, 2017




# పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు

రాజకీయాలకు దూరంగా  నేర పరిశోధన జరగాలని,
స్థానిక ప్రభుత్వాల చేతిలోనే సివిల్ పోలీసు ఉండాలని,
"2006 లో లోక్ సత్తా ప్రతిపాదనలతో సుప్రీంకోర్ట్
ఆదేశాలతో నేర పరిశోధనా వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి
మార్గం సుగమం

**షేర్ చెయ్యండి ...ప్రజలకు  నిజాలు చేరవేయండి**

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan,  Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad